ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
మంగళవారం 3 డిసెంబరు 2024





మిర్చి యార్డులో కలవరం

- అధికారులు, ఇద్దరు సెక్రటరీలపై తీవ్ర అభియోగాలు
- ఇద్దరు ఇన్‌చార్జీలు, 12 మంది సూపర్‌వైజర్లపై కూడా
- విజిలెన్స్ విచారణతో చర్యలకు ఆదేశించనున్న ప్రభుత్వం

గుంటూరు సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వందల కోట్ల రూపాయల అక్రమాలు విజిలెన్స్ విచారణలో వెలుగులోకి రావటంతో గుంటూరు మిర్చియార్డులో కలవరం మొదలైంది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో యార్డులో పనిచేసిన 20 సిబ్బంది పేర్లు చేర్చటం చర్చనీయాంశంగా మారింది. ఇద్దరు అధికారులు, ఇద్దరు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీలు, ఇద్దరు యార్డు ఇన్‌చార్జీలు, 12మంది సూపర్‌వైజర్లపై తీవ్రమైన అభియోగాలు నమోదు అయినట్లు తెలుస్తోంది. నివేదికను ఆధారం చేసుకుని ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించే అవకాశం ఉండటంతో గత ఐదేళ్లలో యార్డులో పనిచేసిన అధికారులు, సిబ్బంది గుండెల్లో రైళ్లు పరుగెత్తున్నాయి.ప్రస్తుతం అప్పట్లో పనిచేసిన సిబ్బందిలో కొద్దిమంది మాత్రమే యార్డులో ఉన్నారు. మిగిలినవాళ్లు ఆయా ప్రదేశాల్లో పనిచేస్తున్నారు. యార్డులో ప్రస్తుతం 34మంది పనిచేస్తుండగా, 10మంది పేర్లు విజిలెన్స్ నివేదికలో ఉన్నట్లు సమాచారం.


ఆదాయం కోసం స్థాయి మార్పు..

గుంటూరు మిర్చియార్డులో ప్రతి ఏటా సుమారు రూ.వెయ్యి కోట్ల వ్యాపారం జరుగుతుండగా, రూ.100కోట్ల వరకు ఆదాయం చేకూరుతోంది. వాస్తవానికి గుంటూరు మిర్చియార్డుకు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీని నియమించాలి. అర్హత కలిగిన సెక్రటరీలు ఉన్నప్పటికీ మార్కెటింగ్ కమిషనర్‌తో సత్సంబంధాలు కలిగిన అధికారులు స్థాయి తగ్గించుకొని అధిక ఆదాయం కలిగిన (మిగతా 8వ పేజీలో..)

డైరెక్టర్ సీరియస్ ?

గుంటూరు మిర్చియార్డులో జరుగుతున్న అవకతవకలపై వస్తున్న కథనాలపై మార్కెటింగ్ డైరెక్టర్ సీరియస్ అయినట్లు తెలుస్తోంది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనంపై కమిషనర్ కార్యాలయం ఆరా తీసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావటంతోనే కొందరిపై వేటుపడవచ్చని చెబుతున్నారు.




బాపట్ల జిల్లా వెదుళ్లపల్లిలో ఇటీవల అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యం



ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూల మూలకు విస్తరించి వున్న రేషన్ మాఫియా గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అక్రమార్కుల ఆట కట్టించేందుకు ప్రయత్నించినా ఏమాత్రం వెరువని రేషన్ మాఫియా తాజా పరిణామాల నేపథ్యంలో ఒకింత ఆందోళనకు గురయింది. నేరుగా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం రేషన్ మాఫియాపై దృష్టి సారించడంతో వారంతా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

మాఫియా ఏరేషన్!

- ప్రభుత్వం దృష్టి సారించడంతో అధికారుల అప్రమత్తం
- కఠిన చర్యలు తప్పవంటూ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు హెచ్చరికలు
- గత కొంతకాలంగా ఇష్టారాజ్యంగా రేషన్ మాఫియా
- సిండికేట్‌గా ఏర్పడి ఇష్టారాజ్యంగా పేదల బియ్యం దోపిడీ
- బినామీ షాపులతో అడ్డూ అదుపులేని అక్రమాలు

గుంటూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో విస్తరించిన రేషన్ మాఫియా జిల్లాలు, రాష్ట్రాలు, దేశాలు దాటి రేషన్‌మాఫియా అక్రమాలు ఖండాంతరాలు చేరింది. సరిహద్దు రాష్ట్రమైన తెలంగాణ మీదుగా కర్నాటక, గుజరాత్, ఇతర ఉత్తరాది రాష్ట్రాలకు పేదల బియ్యాన్ని తరలించడమే కాకుండా కాకినాడ పోర్టు ద్వారా ఇతర దేశాలకు కూడా తరలిస్తున్న ఘటనలు అనేకం ఉన్నాయి. వీటిని కట్టడి చేయడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా అక్రమాలు మాత్రం అణువంత కూడా తగ్గలేదు. రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమయింది. స్వయంగా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కాకినాడ పోర్టులో తనిఖీలు చేపట్టి, అక్రమార్కులపై చర్యలకు ఉపక్రమించారు. దీంతోపాటు స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా హెచ్చరికలు చేయడంతో మాఫియా గుండెల్లో రైళ్లు పరిగెత్తు తున్నాయి. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తీవ్ర హెచ్చరికలు చేసిన నేపథ్యంలో జిల్లా అధికారులు కూడా రేషన్‌మాఫియాపై అప్రమత్తమయ్యారు. ఇప్పటికే జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు, విజిలెన్స్, రెవిన్యూ అధికారులు మాఫియాకు హెచ్చరికలు పంపించారు. అక్రమాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని ఇటు రేషన్‌డీలర్లకు, అటు ఎండీయూ వాహనదారులకు హెచ్చరికలు పంపారు.

అడ్డూ అదుపులేని రేషన్ మాఫియా..

పేదల ఆకలి తీర్చాల్సిన రేషన్ బియ్యం రేషన్ షాపులకు చేరకముందే మాఫియా గూటికి చేరిపోయిన ఘటనలు జిల్లాలో అనేకం నమోదయ్యాయి. ప్రతి నెలా ఒకటో తేదీన ప్రజలకు అందాల్సిన బియ్యం ముందు నెల 25వ తేదీ లోపు రేషన్ షాపులకు చేరుతుంది. కానీ కిందటి నెల 28వ తేదీకల్లా అనేక రేషన్ షాపులు ఖాళీ అయిపోయాయి. బియ్యం అక్రమార్కుల చెంతకు చేరిపోయాయి. దీనిపై విచారణ జరిపి అధికారులు చర్యలు తీసుకున్నా పద్ధతిలో మార్పు రాలేదు.

ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి నేరుగా మాఫియాకు..

రేషన్ డీలర్లకు బియ్యం అందించే మండల స్థాయి స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్ల నుంచే నేరుగా పేదల బియ్యం మాఫియా డంప్‌కు చేరిపోతున్న ఘటనలు అత్యంత ఆందోళనకర పరిణామం. జిల్లాలో రెండు మూడు రేషన్ షాపులు ఒక్కటై ఈ దందా చేస్తున్నాయి. మూడు షాపుల్లో ఒక షాపుకు స్టాకు రాకుండా నేరుగా మాఫియాకు పంపిస్తారు. మిగిలిన రెండు షాపులు మూడో షాపుకు సరుకు సరఫరా చేస్తాయి. అధికారుల తనిఖీల సమయంలో ఒకరికి ఒకరు సహకరించుకుని తప్పించుకుంటున్నారు. దీంతోపాటు చాలా చోట్ల రేషన్ షాపు పక్కన మాఫియా స్టాక్ పాయింట్ పెట్టుకుని అక్కడే బియ్యాన్ని డంప్ చేసుకుని (మిగతా 8వ పేజీలో..)



అసైన్డ్ రైతులకు కౌలు

- సీఐడీ 'నాట్ ట్యాలీడ్' ఉచ్చు నుంచి రైతులకు విముక్తి
- కలెక్టర్ విచారణతో నాట్ ట్యాలీడ్ జాబితా రైతులకు మోక్షం
- కేటగిరీ 1, 2, 3 నుంచి 609 మందికి, 5,6 కేటగిరీల్లో 484 మందికి కౌలు
- రిజిస్ట్రేషన్లకు ఎలాంటి ఆటంకమూ ఉండబోదు
- ఏపీ సీఆర్డీఏ కమిషనర్

గుంటూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాజధాని కోసం ల్యాండ్ పూలింగ్ స్కీము కింద భూములిచ్చిన అసైన్డ్ రైతుల్లో మరో 1,093 మంది రైతులకు కౌలు కష్టాలు తీరనున్నాయి. గత ప్రభుత్వం నమోదు చేసిన సీఐడీ కేసుల కారణంగా 'నాట్ ట్యాలీడ్' జాబితాలో చేరి అనర్హతబారిన పడి మూడేళ్లుగా కౌలుకు, చట్టబద్ధంగా రావాల్సిన ప్రయోజనాలకు దూరమైన అసైన్డ్ రైతులకు కూటమి ప్రభుత్వం రాకతో మోక్షం కలిగింది. గత నెల 28వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన 'రిజిస్ట్రేషన్ల గండం' వార్తపై సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ స్పందించారు. తొలి విడత జాబితా కింద ఈ ఏడాది ఆగస్టులో 1,234 మంది అసైన్డ్ రైతులను 'నాట్ ట్యాలీడ్' జాబితా నుంచి విముక్తి చేసి కౌలు చెల్లించిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మరో 1,093 మందికి కౌలు చెల్లించనున్నామని, వారి రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు ఎలాంటి ఆటంకమూ ఉండబోదని సీఆర్డీఏ కమిషనర్ తెలియజేశారు.

కలెక్టర్ విచారణ అనంతరం విముక్తి

రాజధాని కోసం ఎల్‌పీఎస్ స్కీము కింద భూములిచ్చిన అసైన్డ్ రైతులను ఆరు కేటగిరీలుగా గుర్తించామని చెప్పారు. కేటగిరీ-1 గా మాజీ సైనికులు, స్వాతంత్ర సమరయోధులు, రాజకీయ బాధితుల భూములు, కేటగిరీ- 2, 3 కింద 1954కి ముందు అసైన్ చేసిన భూములు, కేటగిరీ- 4 కింద శివాయజమేదార్లుగా పరిగణించిన భూములు, కేటగిరీ- 5 కింద అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో అర్హులైన ఆక్రమణదారులు, కేటగిరీ- 6 కింద అభ్యంతరం ఉన్న ప్రభుత్వ భూముల్లో అర్హులైన ఆక్రమణదారులుగా గుర్తించారు. ల్యాండ్ పూలింగ్‌లో వీరంతా భూమిలివ్వగా అప్పటి టీడీపీ ప్రభుత్వం (మిగతా 6వ పేజీలో..)

6

మిర్చి వ్యాపారస్తులతో నేడు అధికారుల భేటీ

- సర్క్యులర్లు జారీ చేసిన సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ

4.2 కిలోల గంజాయి స్వాధీనం

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మాజీ ఎంపీ నందిగం సురేష్‌కు మరో 14 రోజుల రిమాండ్

ఢిల్లీలో గుంటూరు మహిళల ప్రతిభ

- ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో మొదటి బహుమతి కైవసం

8

విడిపోతాం

- భారీగా పెరుగుతున్న విడాకుల కేసులు
- అక్కరకు రాని కౌన్సిలింగ్ కేంద్రాలు



వీరారాధన ఉత్సవాల్లో ముగిసిన 'మందపోరు'

- కొణతాలకు నాగులేటిలో స్నానాలు.. ఊరేగింపు


బ్రహ్మనాయుడి నృసింహకుంతాన్ని చేతబూనిన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి తదితరులు

వదలని ముసురు

- తుఫాన్ ప్రభావంపై అన్నదాతల్లో గుబులు
- కొన్ని చోట్ల ఓ మోస్తరు వర్షం... అక్కడక్కడా చిరుజల్లులు
- వరి కోత కోయడానికి జంకుతున్న రైతులు
- ఎంతో కొంత నష్టం తప్పదని ఆవేదన
- ఇప్పటికి 1600 టన్నుల ధాన్యం సేకరణ

దాదాపు ఐదు రోజుల నుంచి వర్షం దోబూచులాడుతూనే ఉంది. తుఫాన్ ప్రభావం వల్ల జిల్లాలో కూడా ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వారం రోజుల క్రితమే హెచ్చరించిన సంగతి తెలిసిందే. అది మొదలుకుని అన్నదాతల కంటిమీద కునుకే కరువయింది. ఒక వైపు కోతకు సిద్ధంగా ఉన్న వరిపైరు ఉంటే మరోవైపు వర్షం హెచ్చరికలు వారిని కుదురుగా ఉండనీయకుండా చేసింది. సరిగ్గా పంట చేతికొచ్చే సమయానికి ఇలా రోజుల తరబడి ముసురుపట్టడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) మూడు రోజుల క్రితం వరకు తుఫాన్ ప్రభావం పెద్దగా లేకపోవడంతో గండం గడిచినట్లేనని రైతాంగం ఊపిరి పీల్చుకుంది. కానీ తుఫాన్ తీరం దాటి సమయంలో జిల్లాలో కూడా వర్షం ప్రభావం ఓ మోస్తరుగా కనిపించడం.. రోజుల తరబడి ముసురు వాతావరణం ఉండడం కూడా రైతులను కలవరపెట్టేదిగా ఉంది. ఆది, సోమవారాల్లో బాపట్ల, రేపల్లె, భట్టిప్రోలు, కొల్లూరు పరిధిలో ఓ మోస్తరు వర్షం కురవగా చుండూరు, పిట్టలవానిపాలెం మండలాల పరిధిలో చిరుజల్లులు రైతులను కలవరపెట్టాయి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా దాదాపు 35,000 ఎకరాల్లో వరిపైరు నేలవాలగా దిగుబడులపై ప్రమాదం చూపే అవకాశం ఉందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఇప్పటికే నూర్పిళ్లు చేసిన ధాన్యాన్ని నిల్వ చేసే విషయంలో కూడా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక కల్లాల్లో ఉన్న ధాన్యం సంగతి మరింత అధ్వానంగా ఉంది. తుఫాన్ హెచ్చరికలకు ముందే జిల్లా వ్యాప్తంగా సాగు చేసిన 2.42 లక్షల ఎకరాల్లో వరికి గానే దాదాపు రెండు లక్షల ఎకరాల వరిపైరు కోతకు సిద్ధంగా ఉంది. వర్షం హెచ్చరికలతో రైతులు చాలా వరకు కోతలను వాయిదా వేసుకున్నారు. కానీ ముసురు ఇలా రోజుల తరబడి ఉండడంతో అదను దాటి కోత కోస్తే కచ్చితంగా దిగుబడుల్లో తేడా రావడంతో పాటు నూక శాతం పెరిగే అవకాశం ఉందని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఇదిలా ఉంటే ఇప్పటికే కురిసిన ఓ మోస్తరు వర్షాలకు తుఫాన్ ప్రభావం తగ్గుముఖం పట్టినా మరో మూడు, నాలుగు రోజుల వరకు కోతలు కోయలేని పరిస్థితి ఉంటుందనేది రైతుల మాటగా ఉంది


పిట్టలవానిపాలెం మండల పరిధిలో నేలవాలిన వరిపైరు

దాదాపు 13,000 ఎకరాల్లో కోతలు పూర్తి

జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు దాదాపు 13,000 ఎకరాల్లో వరికోతలు పూర్తవడంతో పాటు ధాన్యం కూడా చేతికొచ్చింది. వీటికి సంబంధించి ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాల ద్వారా కేవలం 1600 టన్నులు మాత్రమే సేకరించగా మరో 3,000 టన్నుల ధాన్యాన్ని రైతులు నిల్వ చేసుకున్నట్లు క్షేత్రస్థాయి పరిస్థితులు చెబుతున్నాయి. కానీ దాదాపు 4,000 టన్నుల ధాన్యం ఇప్పటికే బహిరంగ మార్కెట్‌కు చేరిపోయినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం తేమ శాతం విషయంలో నిబంధనలు సడలించినప్పటికీ రైతులు దళారులను ఆశ్రయించి అయినకాడికి ధాన్యాన్ని అమ్మేసుకుంటున్నారు. సమీపంలో మిల్లులు లేకపోవడం తోడు రవాణా సమస్యలతో పాటు ఇతర సాంకేతిక సమస్యలు రైతులను బహిరంగ మార్కెట్‌వైపే చూసేలా చేస్తున్నాయి. వర్షం ప్రభావంతో కొంత నష్టం జరిగితే దళారులకు పంటను అమ్ముకొని రైతాంగం మరింతగా నష్టపోతోంది

గత ప్రభుత్వ వైఖరి కూడా కారణం

ఐదేళ్ల వైసీపీ పాలనలో వరి రైతులు పడిన ఇక్కట్లు అన్నీఇన్నీ కావు. నిబంధనల చట్రం దగ్గర నుంచి ఖాతాల్లో డబ్బు జమ చేయడం వరకు అంతా ఒక ప్రహసనాన్ని తలపించేది. దీంతో ఏటికేటా కొనుగోలు కేంద్రాల వైపు వచ్చే రైతులు తగ్గుముఖం పట్టి బహిరంగ మార్కెట్‌లోనే అయినకాడికి పంటను అమ్ముకునే వారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం తేమ శాతంలో సడలింపులు మొదలుకుని ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే అన్నదాతల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూస్తోంది. ఇప్పటికే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతూనే ఉన్నాయి. కానీ గత ప్రభుత్వ అలసత్వం ఇప్పటికీ రైతుల మెదళ్లలో ఉండిపోవడంతో నిబంధనల వంటి శల్యపరీక్షలను ఎదుర్కోవడం కంటే అయినకాడికి బయటే అమ్ముకోవడం మేలని తలంచి అరకొరగా చేతికొచ్చిన ధాన్యాన్నిసైతం నష్టానికే అమ్ముకుంటున్నారు

మరింత భరోసా కల్పించాలి

ఇప్పటికే కోతలు పూర్తయింది దాదాపు 13,000 ఎకరాలే కావడంతో తర్వాత పంట కొనే విషయంలో అయినా అన్నదాతలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉంది. చిరుజల్లులు, ముసురు ప్రభావంతో ధాన్యం తేమ శాతం విషయంలో రైతులకు కచ్చితంగా ఇబ్బందులు ఎదురవుతాయి. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ఒక్క గింజను కూడా ఇతరత్రా కారణాలతో తిప్పి పంపకూడదనే స్పష్టమైన ఆదేశాలను యంత్రాంగానికి ఇవ్వాల్సి ఉంది.

వర్షానికి తడిచిన ధాన్యం

- కరకట్ట వెంబడి ఆరబెట్టుకుంటున్న రైతులు

రేపల్లె,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ తీరప్రాంతంలో తుఫాన్‌కారణంగా గత మూడురోజులుగా కురుస్తున్న వర్షాలు వర్షం కారణంగా కరకట్టపై పోసుకున్న వరిధాన్యం రైతులు ఆరబెట్టుకుంటున్నారు. వర్షం తగ్గుముఖం పట్టటంతో రైతులు ఊపిరిపీల్చుకుంటున్నారు. సోమవారం రోజు తీరప్రాంతంలోని రేపల్లెనియోజకవర్గంలో ఉదయం సన్నపాటి జల్లుపడి ఆగిపోయింది. వర్షం నిలిచిపోవటంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. చేతికందిన పంట నేలపాలవుతుందోనని రైతులు తీవ్ర ఆందోళన చెందారు. భారీవర్షం పడకపోవటంతో రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లలేదు. పంటపొలాల్లో కోసిన ధాన్యాన్ని కరకట్టల వెంబడి ఆరబెట్టుకున్న ధాన్యం కొంతమేర తడిచింది. తడిచిన ధాన్యం రైతులు ఆరబెట్టుకుంటున్నారు. వాతావరణంలో వర్షం ప్రభావం తగ్గటంతో కోతకు వచ్చిన పంటను హార్వెస్టుల ద్వారా పంటను కోసే పనిలో నిమగ్నమయ్యారు.


రుద్రవరం కరకట్ట సమీపం వద్ద తడిచిన ధాన్యాన్ని గ్రేడ్ చేసుకుంటున్న రైతులు

పూలింగ్ ద్వారా భూములు తీసుకోవాలని తీర్మానం


గ్రామసభలో చేసిన తీర్మానాన్ని చూపిస్తున్న సర్పంచి పద్మజ

అమరావతి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో నిర్మించే రైల్వేలైనుకు సంబంధించి మండల పరిధిలోని కర్లపూడి గ్రామానికి చెందిన 240 ఎకరాలు పూలింగ్ ద్వారా తీసుకోవాలని కర్లపూడి గ్రామస్తులు, రైతులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. రైల్వేలైన్‌కు అవసరమైన 430 ఎకరాల్లో 240 ఎకరాలు కర్లపూడి గ్రామానికి చెందినదని గ్రామస్తులు తెలిపారు. సోమవారం సాయంత్రం సర్పంచి ఎం.పద్మజ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో రైతులు పాల్గొని తమ భూమిని పూలింగ్ ద్వారా ప్రభుత్వం తీసుకుని రాజధాని ప్రాంత రైతులకు మాదిరిగా న్యాయం చేయాలని తీర్మానించారు. ఇటీవల రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణను స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌తో కలసి రైతులు కలిశారు. రైల్వేలైనుకు తీసుకునే భూమికి కేంద్ర ప్రభుత్వ నష్ట పరిహారం, రాష్ట్ర ప్రభుత్వం 400 గజాల స్థలం ఇస్తుందని హామీ ఇచ్చారు. దీనికి రైతులు సర్పంచి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించి పూలింగ్ ద్వారా భూములు ఇచ్చేందుకు నిర్ణయించారు. అలాకాకపోతే రైలు మార్గాన్ని రాజధాని నుంచి నిర్మించుకోవాలని రైతులు తెలిపారు. గతంలో కర్లపూడి రైతులకు చెందిన అనంతవరం, నెక్కల్లు గ్రామ రెవెన్యూ పరిధిలోని 140 ఎకరాలు పూలింగ్‌కు తీసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి ఉషారాణి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఢిల్లీలో గుంటూరు మహిళల ప్రతిభ

● ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో మొదటి బహుమతి కైవసం


బహుమతిని కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ చేతుల మీదగా అందుకుంటున్న లక్ష్మీసామ్రాజ్యం

గుంటూరు సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలు ఢిల్లీ వేదికపై ప్రతిభను చాటారు. నవంబరు 14వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరిగిన 43వ ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్ సరస్ మేళాలో అధిక ఉత్పత్తులు విక్రయించి దేశ స్థాయిలో మొదటి బహుమతి సాధించారు. ఈ నేపథ్యంలో మంగళగిరి మండలంలోని స్నేహ మహిళా గ్రూపు సభ్యురాలైన జి.లక్ష్మీసామ్రాజ్యంను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ సోమవారం కలెక్టరేట్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లక్ష్మీ, ఆమె భర్త మధుబాబు మంగళగిరి చేనేత వస్త్రాలు (చీరలు, డ్రెస్ మెటీరియల్ మొదలైనవి) మేళాలో ప్రదర్శించి 15 రోజుల్లో మిగిలిన మహిళల అందరికంటే ఎక్కువ అమ్మకాలు జరిపినట్లు వెల్లడించారు. జిల్లా మహిళా సంఘ సభ్యురాలికి మొదటి బహుమతి రావడం గర్వకారణం అన్నారు.

యూటీఎఫ్ నూతన కమిటీ ఏకగ్రీవం


యూటీఎఫ్ జిల్లా నూతన కమిటీ చేత ప్రమాణ స్వీకారం చేయిస్తున్న కుమార్‌రాజా

నరసరావుపేట టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలో జరిగిన కార్యక్రమంలో యూటీఎఫ్ పల్నాడు జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైందని ప్రధాన కార్యదర్శి ఎం.మోహనరావు సోమవారం తెలిపారు. గౌరవాధ్యక్షుడుగా షేక్ ఖాసీమ్ పీరా, అధ్యక్షుడుగా కె.శ్రీనివాసరెడ్డి, సహాధ్యక్షుడుగా జె.వాల్యా నాయక్, సహాధ్యక్షురాలుగా ఎ.భాగేశ్వరిదేవి, ప్రధాన కార్యదర్శిగా ఎం.మోహనరావు, కోశాధికారిగా ఎం.రవిబాబు ఎన్నికైయ్యారు. కార్యవర్గం చేత రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు ఎస్.కుమార్‌రాజా ప్రమాణ స్వీకారం చేయించారు. జీవో 117ను రద్దు చేసి పాఠశాలల విలీన ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని, బోధన సమయాన్ని హరిస్తున్న యాప్‌ల భారాన్ని తీసివేయాలని, ఉపాధ్యాయుల సమయాన్ని కేవలం బోధనకే కేటాయించేలా చూడాలని నూతన కమిటీ డిమాండ్ చేసింది. సీపీఎస్, జీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కొత్త పీఆర్‌సీ కమిషన్‌లను ఏర్పాటు చేసి తక్షణమే మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు.

మిర్చి వ్యాపారస్తులతో నేడు అధికారుల భేటీ

● ఉదయం 11 గంటలకు దిగుమతి వ్యాపారస్తులతో సమావేశం
● సాయంత్రం 4 గంటలకు ఎక్స్‌పోర్టర్లతో మీటింగ్
● సర్క్యులర్లు జారీ చేసిన సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ

గుంటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మిర్చి ఎగుమతి, దిగుమతి వ్యాపారస్తులతో మంగళవారం సమావేశం కావాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ గుంటూరు అధికార యంత్రాంగం నిర్ణయించింది. మంగళవారం ఉదయం కమిషన్, సాయంత్రం ఎక్స్‌పోర్టు వ్యాపారస్తులతో వేర్వేరుగా సమావేశాలు ఏర్పాటుకు షెడ్యూల్ ఖరారు చేశారు. వ్యాపారస్తులంతా ఆయా సమావేశాలకు విధిగా హాజరు కావాలని ఆదేశించారు. ప్రధానంగా మిర్చియార్డులో ఈ-నామ్ విధానం లాట్ ఐడీలు జనరేట్ చేయడం మొదలుకొని లాట్ ఎగ్జిట్ వరకు అన్ని దశలలో అమలు చేయాల్సి ఉంది. అలానే బిల్ టూ బిల్, కటింగ్, జీరో వ్యాపారాలన్ని పూర్తిగా నిలిపేయాలి. వీటితోపాటు మరికొన్ని అంశాలపై సమావేశాల్లో చర్చించనున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. ఈ సమావేశాలకు మార్కెటింగ్ ఉన్నతాధికారులు కూడా హాజరయ్యే అవకాశం ఉన్నది.

ఈనామ్ అమలు నామమాత్రమే..

జాతీయ వ్యవసాయ మార్కెట్‌ని ఈనామ్‌గా పరిగణిస్తారు. 2016లో ఈనామ్ అమల్లోకి వచ్చింది. ఈనామ్‌లో రైతులు, ట్రేడర్లు, బయ్యర్లు ఉంటారు. రైతుకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కేంద్రం ఈ విధానాన్ని తీసుకొచ్చింది. ఈనామ్‌లో మిర్చియార్డుకు రైతులు తీసుకొచ్చిన మిర్చి టిక్కీలకు తొలుత లాట్ ఐడీని జనరేట్ చేస్తారు. వాటికి సంబంధించిన శాంపిల్స్‌ని ఈనామ్‌లో ప్రదర్శిస్తారు. వాటికి ఎగుమతిదారులు ఆక్షన్‌లో ధర పేర్కొనాలి. ఆ ధర రైతుకు ఇష్టమైతేనే విక్రయించాలి. లేదంటే తిరస్కరించొచ్చు. ఆక్షన్ అయిపోగానే వెంటనే కాటాలు వేసి ఆ రోజే నగదు చెల్లింపు చేయాలి. ఇది కూడా ఆన్‌లైన్‌లో జరగాలి. ఈనామ్‌కు మొబైల్ యాప్ కూడా ఉండటం వలన సెల్‌ఫోన్‌లోనే అటు రైతులు, ఇటు వ్యాపారస్తులు అన్ని విషయాలను చూసుకోవచ్చు. అయితే గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో కేంద్ర ప్రభుత్వ ఈ-నామ్ విధానం అమలు నామమాత్రంగా ఉంది. ఇతర ప్రాంతాలకు చెందిన ఎక్స్‌పోర్టర్లు ఎవరూ ఇక్కడి మిర్చిని కొనుగోలు చేయరు. తొలుత స్థానిక ఎగుమతిదారులు కమీషన్ వ్యాపారుల దుకాణాలకు వెళ్లి మిర్చి శాంపిల్స్‌ని చూసి ఎంత మోతాదులో సరుకు ఉందో తెలుసుకుంటారు. ఆ తర్వాత కమీషన్ వ్యాపారి, రైతు సమక్షంలో ధర మాట్లాడుకుని ఎలాంటి పోటీ లేకుండా ఈనామ్ ఆక్షన్‌లో పాల్గొని సరుకుని దక్కించుకుంటారు. దీనివలన గతంలో మూస పద్ధతిలో జరిగిన లావాదేవీలకు, ఈనామ్‌లో జరుగుతున్న ట్రేడింగ్‌కు ఎలాంటి వ్యత్యాసం లేకుండా పోయింది. యార్డులో వ్యాపారస్తులంతా సిండికేట్ అయి ఉన్నారు. ఏమైనా ఒత్తిడి పెడితే వెంటనే ట్రేడింగ్ నిలిపేసి రైతులకు ఇబ్బందులు కలిగిస్తారు. గతంలో పలుమార్లు ఇలాంటి సంఘటనలు జరిగాయి. కొన్ని రోజులుగా జీరో, కటింగ్, బిల్ టూ బిల్ వ్యాపారాలపై పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు వస్తుండటంతో మార్కెటింగ్ కమిషనర్ విజయ సునీత సోమవారం యార్డు సెక్రెటరీ వినుకొండ ఆంజనేయులుకు నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం నుంచి అన్నీ ఈనామ్‌లోనే జరగాలని స్పష్టం చేశారు. అందులో భాగంగానే మంగళవారం వ్యాపారస్తులతో సమావేశాలు ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు.

ఏపీఎంను సస్పెండ్ చేయాలి

● గొట్టిపాడు డ్వాక్రా సంఘాల ఆందోళన


రోడ్డుపై గొట్టిపాడు డ్వాక్రా మహిళల ధర్నా

ప్రత్తిపాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మూడు గంటల పాటు తహసీల్దార్ కార్యాలయం వద్ద వేచి ఉన్నా, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఆగ్రహించిన గొట్టిపాడు డ్వాక్రా సంఘాల మహిళలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఏపీఎంను సస్పెండ్ చేయాలంటూ రాస్తారోకోకు దిగారు. గొట్టిపాడులోని రాధాకృష్ణ గ్రామైక్య సంఘానికి సంబంధించి వీవోఏ జె.శ్రీకాంతను తొలగించే విషయంతో కొంతకాలంగా రచ్చ జరుగుతుంది. ఆ గ్రామైక్య సంఘానికి సంబంధించి డ్వాక్రా సంఘాల ప్రమేయం లేకుండా అధికారులు వీవోఏను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని, అందులో భాగంగానే శ్రీనిధి బయోమెట్రిక్‌లో ఆధార్‌ను మార్చారంటూ ఆ సంఘం మహిళలు ఆరోపిస్తున్నారు. దీనిపై పూర్తి వివరాలు, ఆధారాలతో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి సుమారు 50 మంది మహిళలు వచ్చారు. తొలుత తహసీల్దార్ కరుణ కుమార్ వచ్చి మహిళలతో మాట్లాడారు. అర్జీ ఇస్తే నెల రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానన్నారు. తాము అడిగిన ప్రశ్నలకు ఏపీఎం వచ్చి సమాధానం చెప్పాలని మహిళలు పట్టుబట్టారు. బయటకు వచ్చిన ఏపీఎంను బయోమెట్రిక్ ఆధార్‌ను ఎందుకు మార్చారో చెప్పాలంటూ మహిళలు ప్రశ్నించారు. అంతేకాకుండా తమ సంఘానికి సంబంధం లేకుండా వీవోఏను ఎందుకు మార్చే ప్రయత్నం చేస్తున్నారని ప్రశ్నించారు. తమ గ్రూపునకు వీవోఏ ఎవరో చెప్పాలంటూ డిమాండ్ చేశారు. పరిశీలించి సమాధానం చెబుతానని ఏపీఎం చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆగ్రహించిన మహిళలు ఏపీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆయన్ను సస్పెండ్ చేయాలంటూ ప్లకార్డులు పట్టుకుని రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ట్రాఫిక్ కొద్ది సేపు ఆగిపోయింది. పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. అనంతరం డ్వాక్రా సభ్యురాలు గుంటుపల్లి శివకుమారి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏపీఎం అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు.

పోలీసులకు ఏపీఎం ఫిర్యాదు

మహిళలు తన చేయి పట్టుకుని లాగి కొట్టబోయారని ఆరోపిస్తూ ఏపీఎం లాజర్ ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్రకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

అసైన్డ్ రైతులకు కౌలు

(5 పేజీ తరువాయి)

వీరికి చట్టబద్ధమైన కౌలు, ప్రయోజనాలు కల్పించింది. అయితే గత ప్రభుత్వం 1, 2, 3 కేటగిరీల భూములపై సీఐడీ కేసులు నమోదు చేయడం వల్ల ఆ రైతులకు సంవత్సరాది కౌలు, నివాస స్థలాలు, వాణిజ్య ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలిపివేసింది. వాటిపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపి నివేదికను సీఐడీ అధికారులకు పునఃపరిశీలన నిమిత్తం పంపగా తొలి విడతలో 1,234 మంది రైతులకు అర్హత లభించిందని, వారికి చట్టబద్ధమైన ప్రయోజనాలు ఇస్తున్నట్లు ఈ ఆగస్టులో సీఆర్డీఏ, ప్రభుత్వం ప్రకటించింది. 1,234 మందికి వార్షిక కౌలు రూ. 22. 03 కోట్ల రూపాయలు జమ చేసింది.

● రెండో విడతలో..

రెండో విడతగా మరో 609 మంది రైతులకు అర్హత లభించిందని సీఆర్డీఏ కమిషనర్ తెలిపారు. వారికి రూ.2.35 కోట్లకు ప్రతిపాదనలు ఆమోదించగా, బిల్లు ఆర్థిక శాఖ వద్ద ఫండ్ క్లియరెన్సులో ఉన్నట్లు ఆయన వివరించారు. వారికి కేటాయించిన రిటర్నబుల్ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసేందుకు తగిన చర్యలు అధికారులు చేపట్టారని తెలిపారు. నాట్ ట్యాలీడ్ జాబితాలో వున్న 5, 6 కేటగిరీల రైతుల పొలాలపై కూడా విచారణ జరపగా 484 మంది రైతులకు అర్హత లభించిందని ఈనెల 27న వారి కౌలు చెల్లింపులకు ఆమోదం లభించిందని, వారికి కౌలు చెల్లించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశామని ఆయన తెలియజేశారు. వారి ప్లాట్ల రిజిస్ట్రేషన్లకూ ఆటంకం ఉండదని, త్వరతగతిన రిజిస్ట్రేషన్లు పూర్తి చేసేందుకు ఆదేశాలు జారీ చేశామని సీఆర్డీఏ కమిషనర్ తెలియజేశారు. కాగా 1,2,3 కేటగిరీలకు చెందిన అర్హత కలిగిన 683 మంది రైతుల వివరాలను జిల్లా కలెక్టర్ ఈనెల 26న సీఆర్డీఏ కార్యాలయానికి పంపగా దానిని సీఐడీ అధికారుల పునఃపరిశీలనకు పంపించారు. వారి ఆమోదం లభిస్తే వారికి కూడా వార్షిక కౌలుతోపాటు, చట్టపరంగా రావాల్సిన ప్రయోజనాలు అందనున్నాయి.

జాతి పరువు తీయడం.. దేశద్రోహమే

● మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్



నరసరావుపేట టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఒప్పందాల్లో రూ.1750 కోట్లు ఇచ్చినట్లు న్యూయార్క్ కోర్టులో జగన్, కొంతమంది అధికారుల పేర్లతో ఛార్జిషీటు దాఖలు అయిందని, ఇది దేశద్రోహం కిందకు వస్తుందని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. సోమవారం నరసరావుపేట పట్టణం మున్సిపల్ అతిథి గృహంలో మీడియాతో ఆయన మాట్లాడారు. న్యూయార్క్ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయడంతో జాతి పరువు పోయిందనీ, కనుక ఇది దేశద్రోహమేనని చెప్పారు. రూ. 1750 కోట్లు రికవరీ చేయాలని, అందులోని నిందితులపై దేశద్రోహం కింద కేసు నమోదు చేయాలన్నారు. కోటిన్నర టన్నుల బియ్యాన్ని కృష్ణపట్నం, మచిలీపట్నం, కాకినాడ, వైజాగ్ పోర్టుల ద్వారా దోపిడీ చేశారని ఆరోపించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్ పోర్టుల సందర్శనలో బియ్యం అక్రమ రవాణాను చూశాం అన్నారు. సుమారు రూ.50 వేల కోట్ల సంపద అన్నారు. ఇది పేద ప్రజలు తినే అహారం అన్నారు. జగన్ బృందం పేదల తీసుకునే ఆహారాన్ని కూడా వదలిపెట్టారా అని మాజీ మంత్రి ప్రశ్నించారు.

నందిగం సురేశ్‌కు మరో 14 రోజుల రిమాండ్


పోలీసు వ్యానులో నుంచి అభివాదం చేస్తున్న నందిగం సురేశ్

మంగళగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను తుళ్లూరు పోలీసులు సోమవారం మంగళగిరి కోర్టులో హాజరుపర్చారు. తుళ్లూరుకు చెందిన మరియమ్మ అనే వృద్ధురాలి హత్య కేసుకు సంబంధించి సురేశ్ జ్యుడీషియల్ రిమాండ్‌లో వున్నారు. రిమాండ్ గడువు సోమవారం ముగియడంతో పోలీసు వ్యానులో మంగళగిరి కోర్టుకు తీసుకువచ్చారు. న్యాయమూర్తి మరో 14 రోజులపాటు రిమాండ్‌ను పొడిగిస్తూ ఉత్తర్వులిచ్చారు. అనంతరం సురేశ్‌ను తిరిగి గుంటూరు జిల్లా జైలుకు తరలించారు.

ఏసీ సర్వీసుల ఛార్జీలపై రాయితీ

గుంటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏసీ సర్వీసులపై టిక్కెట్ ఛార్జీల్లో ఆర్టీసీ రాయితీ ప్రకటించింది. ఆదివారం మినహా సాధారణ రోజుల్లో మాత్రమే రాయితీలు వర్తిస్తాయని గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం తెలిపారు. అమరావతి ఏసీ సర్వీసుకు టిక్కెట్ ఛార్జీల్లో 20 శాతం రాయితీ ఉంటుందన్నారు. అమరావతి ఏసీ సర్వీసుకు 20 శాతం రాయితీ అంటే రూ. 742ల నుంచి రూ.593కు ఛార్జీ తగ్గించనున్నట్లు తెలిపారు. అలాగే ఇంద్ర (బీహెచ్ఈఎల్) ఏసీ సర్వీసుకు 10 శాతం రాయితీపై రూ.585 నుంచి రూ.526కు ఛార్జీని వసూలు చేయనున్నట్లు తెలిపారు. రాయితీ ఈ నెల ఒకటో తేదీ నుంచి 31 వరకు అమల్లో ఉంటుందన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం


మాట్లాడుతున్న హైమారావు వేదికపై మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ

గుంటూరు (విద్య), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పాఠశాలలు బలోపేతం దిశగా అడుగులు వేస్తూ ముందుకు పోతుందనీ, ప్రతి శుక్రవారం గుర్తింపు పొందిన సంఘాలతో ముందుగా చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటున్నారని త్వరలో ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ అన్నారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఆఫీసు బేరర్ల సమావేశం మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం నిర్వహించారు. సమావేశంలో ఎన్‌టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సెలవులపై ఆంక్షలు పెట్టడం సరికాదన్నారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్, పీఆర్‌టీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరాజు, చిగురుపాటి పినాకపాణి, జిల్లా నాయకులు యుగంధర్, బాలా త్రిపుర సుందరి, క్రమశిక్షణ సంఘం చైర్మన్ చెరుకూరి సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర అధ్యక్షుడు నడిపినేని వెంకట్రావు పాల్గొన్నారు.

4.2 కిలోల గంజాయి స్వాధీనం


నిందితులను అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ జనార్దనరావు

చేబ్రోలు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తూ సంచరిస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 4.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెనాలి డీఎస్పీ డి.జనార్దనరావు సోమవారం తెలిపారు. చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ ఆదివారం చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ పరిధిలో పొన్నూరు రూరల్ సీఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్సై డి.వెంకటకృష్ణ సోదాలు నిర్వహిస్తుండగా కామధేను సీడ్ కంపెనీ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో ముగ్గురు అనుమానితులను గుర్తించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన హృదానంద దాస్, ప్రసన్న రౌత్రే, జడజన నిందితులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా వారి వద్ద 4.2 కిలోల గంజాయి ఉంది. ఈ ముగ్గురు ఒడిశా నుంచి గంజాయిని నారాకోడూరు తీసుకువచ్చి వాటాలు వేసుకుని పంచుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. చిన్న చిన్న పొట్లాలుగా గంజాయిని మార్చి యువతకు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నట్లుగా చెప్పారు. కార్యక్రమంలో సీఐ కోటేశ్వరరావు, ఎస్సై వెంకటకృష్ణ పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

దాచేపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం రామాపురం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన ఆశం లింగారెడ్డి (35) నివాస గృహంలో ఉరి వేసుకొని మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు లింగారెడ్డిని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతునికి గతంలో రూ.15 లక్షల వరకు అప్పులు ఉన్నాయి. ఈ ఏడాది కూడా 2 ఎకరాల పత్తి, 3 ఎకరాల మిరప పంటలను సాగు చేశాడు. ఈ ఏడాది కూడా పంటలు సక్రమంగా లేకపోవడంతో బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. దాచేపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్రకాశం జిల్లా వాసి దుర్మరణం

దాచేపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆటో సాంకేతిక లోపంతో సడన్‌గా ఆగిపోవడంతో వెనుక వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడు ఆటోను వెనుక వైపు ఢీకుని మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లి వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మృతుడు ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలం నల్లసముద్రం గ్రామానికి చెందిన మోతుకూరి ఏడుకొండలు (32)గా గుర్తించారు. ఏడుకొండలు హైదరాబాద్ నుంచి ఒంగోలుకు హోండా షైన్ వాహనంపై వస్తున్నాడు. అతనికి ముందుగా వెళ్తున్న ఆటో సడన్‌గా ఆగిపోయింది. వేగంగా ప్రయాణిస్తున్న ఏడుకొండలు వేగాన్ని నియంత్రించలేక ఆటోను ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలైయ్యాయి. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దాచేపల్లి ఎస్ఐ పాపారావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని ఆటో డ్రైవర్ మృతి

రాజుపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - మాచర్ల రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన రాజుపాలెం గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన తురకా ప్రసాదు (32) తన ఆటోలో చంద్రాజుపాలెం నుంచి సత్తెనపల్లి వెళ్తుండగా మార్గమధ్యలోని రాజుపాలెం గ్రామ సమీపంలో ఉన్న కోళ్లఫారాలు వద్దకు వచ్చేసరికే ఎదురుగా అతి వేగంగా వస్తున్న లారీ ఆటోను ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆటో డ్రైవర్ తురకా ప్రసాదుకు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో సత్తెనపల్లి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై వేణుగోపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ చెన్నై సర్వీసు పునరుద్ధరణ

గుంటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చెన్నైలో భారీ వర్షాలు తగ్గుముఖం పట్టడంతో సోమవారం నుంచి ఆర్టీసీ చెన్నై సర్వీసును పునరుద్ధరించినట్లు గుంటూరు -1 డిపో మేనేజర్ రామకృష్ణ తెలిపారు. గుంటూరు-1 డిపో నుంచి చెన్నైకు నిత్యం ఉదయం 9.45 గంటలకు గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్ నుంచి బయల్దేరే సర్వీసును పునరుద్ధరించినట్లు తెలిపారు.

8న క్రీడా జ్ఞాన పరీక్ష

● జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి పాల్‌కుమార్

బాపట్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైస్‌ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు చైతన్య కశ్వత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడాభారతి పురస్కారాల కోసం ఈనెల 8వ తేదీన క్రీడా జ్ఞాన పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.పాల్‌కుమార్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు వ్యక్తిగత రిజిస్ట్రేషన్‌లు చేసుకోవాలన్నారు. వివరాలకు వెబ్‌సైట్‌లో చూడవచ్చు అని తెలిపారు. మొదటి బహుమతిగా రూ.లక్ష, రెండో బహుమతిగా రూ.50 వేలు, మూడో బహుమతిగా రూ.25 వేలు, నాల్గవ బహుమతిగా రూ.11 వేలు అందిస్తారని తెలిపారు.

స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మోడల్ టెస్ట్

బాపట్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్‌ఎంఎంఎస్ మోడల్ గ్రాండ్ టెస్ట్ ఆది, సోమవారాలలో నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ మోడల్ టెస్ట్ జిల్లా, మండల కేంద్రాలలో స్కూల్ స్థాయిలో నిర్వహించారు. జిల్లాలో నిర్వహించిన మోడల్‌టెస్ట్‌కు 1500 మంది 8వ తరగతి విద్యార్థులు హాజరయ్యారు. 175 మంది ఉపాధ్యాయులు టెస్ట్ నిర్వహణకు సహకరించారు. ఆయా ప్రాంతాలలో నిర్వహించిన మోడల్ టెస్ట్‌కు జిల్లా అధ్యక్షుడు కె.పిచ్చయ్య, ప్రధాన కార్యదర్శి సీహెచ్ టివి సురేష్ పర్యవేక్షించారు.

విరాళాల సేకరణకు అధికారులంతా సహకరించాలి : డీఆర్వో

బాపట్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన సైనికుల కుటుంబాల సహాయార్థం విరాళాల సేకరణలో జిల్లా అధికారులంతా సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్ తెలిపారు. సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి సంబంధించి రూపొందించిన వాల్‌పోస్టలను కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా సైనిక సంక్షేమశాఖవారు రూపొందించిన స్టిక్కర్లను జిల్లా అధికారులు, సిబ్బంది కొనుగోలు చేయాలన్నారు. అధిక మొత్తంలో విరాళాలు సేకరించటం ద్వారా సైనిక కుటుంబాలను ఆదుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్పొరేటివ్ అధికారి శ్యామ్‌సన్, జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారులు పాల్గొన్నారు.

పేదలగోడు ఆలకించని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు : వెంకట్రావు

బాపట్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదానీ, అంబానీలకు ఏమాత్రం ఇబ్బంది కలుగుతుందని తెలిసినా లోపాయికారి ఒప్పందాలతో యుద్ధప్రాతిపదికన సాయం చేస్తూ పేదవాడి గోడు మాత్రం ఆలకించటం లేదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రావు విమర్శించారు. పట్టణంలోని 3వ వార్డు రైలుపేట సచివాలయంలో సామూహిక అర్జీల సమర్పణ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి వెంకట్రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జేబీ శ్రీధర్, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి రత్నకుమారి, సీపీఐ నాయకులు పోలిరెడ్డి, కొండలురెడ్డి, మహాలక్ష్మి, సీతారావమ్మ పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయాధికారులు సూచనలు

చెరుకుపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వరికోతలకు సిద్ధంగా ఉన్న రైతులు రెండు రోజులు చూసుకుని కోతలు కోసుకోవాలని మండల వ్యవసాయ అధికారి టి.బాలాజీగంగాధర్ అన్నారు. మండలంలోని రైతులకు వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఆయన కొన్ని సలహాలు, సూచనలు ఇచ్చారు. వర్షాలు ఎక్కువగాపడినట్లయితే కాలువల ద్వారా నీటిని తీసివేయాలని సూచించారు. వర్షాలు ఇంకా పడుతున్నందున కోతలు ఆపుకోవాలన్నారు.

వర్షంతో అన్నదాతల ఆందోళన

నగరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం పండించిన వరి కోతకు సిద్ధమై దక్కుతుందో లేదోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వర్షం, ఈదురుగాలులతో నేలవాలిన వరి పంటను కోత కోసేందుకు కూలీలు అమాంతంగా రేట్లు పెంచివేస్తారని రైతన్నలు వాపోతున్నారు. వరి కోతకు సిద్ధమైన అన్నదాతలు రెండో పంటగా అపరాలను వరి పైరులో వెదజల్లారు. ఎకరానికి సుమారు రూ.5 వేల నుంచి రూ.8 వేలు ఖర్చు చేశామని కోత ఆలస్యమయ్యే కొద్ది అపరాలు దెబ్బతింటాయని రైతులు కలవరపడుతున్నారు. ఏది ఏమైన తుఫాన్ ప్రభావం రైతన్నల పాలిట శాపంగా మారిందని కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

భక్తి ప్రపత్తులతో పోలి పాడ్యమి

వేమూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీక మాసం దీక్ష పూర్తి చేసుకున్న భక్తులు సోమవారం తెల్లవారుజామున భక్తి ప్రపత్తులతో పోలి పాడ్యమి నిర్వహించారు. తెల్లవారుజామున కార్తీక మాసం ముగింపు స్నానాలు చేసి అనంతరం అరటి దొప్పలలో ఆవు నేతి దీపాలు వెలిగించి పూజలు చేసిన అనంతరం వాటిని కోనేరు, ప్రవహించే జలాలు ఉన్న కాల్వల్లో వదిలారు. శివ, విష్ణు ఆలయాలలో కార్తీక మాసం ఉద్యాన పూజలు జరిపారు. ఆలయాలలో భక్తులు కిటకిటలాడారు.

ద్విచక్రవాహనాలు ఢీ : ఇద్దరికి గాయాలు

కర్లపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పంచాయతీ పరిధిలోని ఉమ్మారెడ్డి నగర్ సమీపంలో జాతీయ రహదారిపై రెండు బైక్‌లు ఢీకొనటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. రెండు ద్విచక్రవాహనాలు నుజ్జు నుజ్జు అయ్యాయి. ఏట్రవారిపాలేనికి చెందిన కుమార్ రెడ్డి ద్విచక్రవాహనంపై బాపట్ల వెళుతూ ఉమ్మారెడ్డినగర్ సమీపంలో బాపట్ల నుంచి వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొనటంతో గాయాలయ్యాయని తెలిపారు. గాయాలైన వారిని చికిత్స నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఉపకార వేతనాల పరీక్షలు పగడ్బందీగా నిర్వహించాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ప్రతిభ ఉపకార వేతనాల పరీక్షలు పగడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల నిర్వహణపై సంబంధితాధికారులతో సోమవారం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ప్రతిభ ఉపకారవేతనాల పరీక్షలు ఈనెల 8వ తేదీన జిల్లా వ్యాప్తంగా 10 పరీక్షా కేంద్రాలలో జరుగుతాయన్నారు. 2,319 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. 2 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించామన్నారు. 10 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు మరో 10 మంది అధికారులు, 99 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ప్రాథమిక వైద్యం అందించటానికి 20 మంది ఎఎన్‌ఎంలను నియమించామన్నారు. పరీక్షలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆర్టీసీ బస్సులు నడపాలని, విద్యుత్ సరఫరా ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్‌సెంటర్‌లు మూసివేయాలన్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్, డీఈవో ఎస్.పురుషోత్తం, ఆర్డీవో పి.గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి : కలెక్టర్

విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయటానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. స్థానిక మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం స్టూడెంట్స్ అసెంబ్లీకి కలెక్టర్ హాజరయ్యారు. జాతీయ జెండా ఎగురవేసి విద్యార్థులనుంచి గౌరవవందనం స్వీకరించారు. తదుపరి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించే సమావేశం ఈనెల 7న జరుగుతుందన్నారు. రాష్ట్రస్థాయి కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరవుతారన్నారు. పాఠశాలకు అరుదైన గౌరవం దక్కిందన్నారు.

విద్యాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే వేగేశన

● తానా సౌజన్యంతో విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ


విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ తదితరులు

బాపట్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మండలంలోని నరసాయపాలెం గ్రామానికి చెందిన డాక్టర్ శ్రీనివాసుల విజయరాంబాబు తానా వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన సైకిళ్ళను సోమవారం ఎమ్మెల్యే చేతుల మీదగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే పేద విద్యార్థులకు ఈ విధంగా సైకిళ్ళను పంపిణీ చేయటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ముక్కామల సాంబశివరావు, సీనియర్ నాయకులు కామేపల్లి కృషిబాబు, మందపాటి ఆంద్రేయ, దివి రాము తదితరులు పాల్గొన్నారు

12న సెమీ క్రిస్మస్ వేడుకలకు వేగేశనకు ఆహ్వానం

పిట్టలవానిపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి ఈనెల 12వ తేదీన క్రీస్తు నిరీక్షణ ప్రార్దన మందిరంలో జరిగే సెమీ క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మను ఆమె కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి ఆహ్వానపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు లక్కంరాజు వెంకటపతిరాజు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కనుమూరి సాంబమూర్తిరాజు, సోపాటి వెస్లి తదితరులు పాల్గొన్నారు.

లూథరన్ ప్రార్ధన మందిరాన్ని సందర్శించిన వేగేశన

కర్లపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పంచాయతీ దాసనగర్‌లో గ్రామస్థుల సహకారంతో నిర్మాణం జరుగుతున్న లూథరన్ ప్రార్ధన మందిరాన్ని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ సోమవారం సందర్శించారు. సింహద్వారం నిలబెట్టే ప్రార్ధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే నరేంద్రవర్మను దుశ్శాలువా, పూలమాలలతో సంఘ పెద్దలు ఘనంగా సన్మానించగా పాస్టర్ ఆశీస్సులు అందజేశారు. ప్రార్ధన మందిర నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం ఇవ్వనున్న ఎమ్మెల్యేకి నిర్వాహకులు, గ్రామపెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఏపూరి భూపతిరావు, నాయకులు నక్కల వెంకటస్వామి, పిట్ల వసంతరెడ్డి, గుంపుల కన్నయ్య, మేకల యిర్మియా, షేక్ బాజీ, పఠాన్ అహ్మద్‌బాషా, సయ్యద్ రఫీ, రాంబాబురెడ్డి, పిట్టు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంటెక్ ఫుడ్ టెక్నాలజి కోర్సు ప్రారంభం

బాపట్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో సోమవారం ఎంటెక్ ఫుడ్ టెక్నాలజి కోర్సు ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమానికి డీన్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్స్ స్టూడెంట్స్ డాక్టర్ ఎవి.రమణ అధ్యక్షత వహించగా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీదేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో డీన్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజి డాక్టర్ ఎ.మణి, డీన్ ఆఫ్ స్టూడెంట్ ఎఫైర్స్ డాక్టర్ పి.సాంబశివరావు, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనా రాణి, డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డిడి స్మిత్, డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్రసాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్, విశ్వవిద్యాలయ విశ్రాంత అధ్యాపకులు, ప్రొఫెసర్‌లు, అసోసియేట్ డీన్‌లు పాల్గొని 21 సంవత్సరాల తర్వాత కళాశాలలో ఎంటెక్ ఫుడ్ టెక్నాలజి ప్రారంభమైందని తెలిపారు. అనంతరం విద్యార్థులచే ఫ్రెషర్స్‌డే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్‌వీవీ సత్యనారాయణ, డాక్టర్ వీరరాఘవయ్య, డాక్టర్ భాస్కరరావు, డాక్టర్ విష్ణుశంకరరావు, డాక్టర్ జాగర్లమూడి లక్ష్మి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైస్‌చాన్సలర్ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీదేవి, డీన్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్స్ స్టూడెంట్స్ డీన్ డాక్టర్ ఏవీ రమణ

మండలస్థాయి అధికారులతో జడ్పీ సీఈవో సమీక్ష


మండల స్థాయి అధికారులకు సూచనలు చేస్తున్న జడ్పీ సీఈవో జ్యోతిబసు

బాపట్లరూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 7వ తేదిన బాపట్ల పర్యటన సందర్భంగా ప్రజలు నుంచి వచ్చే అర్జీలను ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక ద్వారా సేకరించి ఆన్‌లైన్ ద్వారా సీఎం కార్యాలయానికి పంపించే నిమిత్తం పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్‌లకు విధులు కేటాయిస్తున్నట్లు గుంటూరు జిల్లా పరిషత్ సీఈవో వి.జ్యోతిబసు తెలిపారు. జిల్లాపరిషత్ పరిధిలోని 12 మంది ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, బాపట్ల మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లతో బాపట్ల మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. బాపట్ల ఎంపీడీవో బి.బాబురావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లలో యావత్తు సిబ్బంది అప్రమత్తతతో ఉండి విధులు నిర్వహించాలని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఉత్పత్తులు ఆరోగ్య దాయకం


ప్రకృతి వ్యవసాయం గురించి వివరిస్తున్న డీపీఎం వాణిశ్రీ

భట్టిప్రోలు, (కొల్లూరు) డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంట ఉత్పత్తులు ఆరోగ్యదాయకమని డీపీఎం వాణిశ్రీ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ఆర్‌డిఎస్ కిట్స్ పంపిణీలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డీపీఎం మాట్లాడుతూ, రైతులు ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపాలని, ఈ విధానంలో పండించిన పంట ఉత్పత్తులు ఎంతో శ్రేయస్కరమని ఆర్‌డిఎస్ కిట్స్ వల్ల కలిగే ఉపయోగాల గురించి రైతులకు వివరించారు. ఎంపీడీవో ఎస్.వెంకటరమణ మాట్లాడుతూ, ప్రతి సోమవారం విక్లీ మార్కెట్‌లో ఉంచుతున్న కూరగాయలు, ఆకు కూరలను కొనుగోలు చేసి భుజించాలన్నారు. ఏపీఎం శ్రీమన్నారాయణ మాట్లాడుతూ, గ్రామాల్లో సమాఖ్య సంఘాల ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ శిక్షకులు నీలం ప్రకాష్‌కుమార్, ఏవో మీరయ్య, ఈవోపీఆర్డీ ఊహారాణి, ఏపీవో శివపార్వతి, వెల్లటూరు, సూరేపల్లి, ఐలవరం సీఆర్‌ఎఫ్‌లు, రైతులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ కూరగాయల స్టాల్స్ ప్రారంభం


ఆర్గానిక్ స్టాల్‌ను ప్రారంభిస్తున్న నగరం మండల అభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు

నగరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆర్గానిక్ కూరగాయలను ఆహారంలో చేర్చుకోవటం ద్వారా అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని నగరం మండల అభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయాల వద్ద ఆర్గానిక్ కూరగాయలను స్టాల్స్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో లభించే కూరగాయల ధరలకన్న తక్కువ ధరలకే ఈ ఆర్గానిక్ కూరగాయలు అందించనున్నామన్నారు. పలు రకాల కూరగాయలపై విషపూరితమైన రసాయనాలను వాడుతున్నారని, దీని వలన ప్రజారోగ్యం దెబ్బతింటుందన్నారు. ప్రజలు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆర్గానిక్ ద్వారా పండించిన కూరగాయలు, బియ్యం తక్కువ ధరలకే తీసుకుని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని ఆయన తెలిపారు.

గాజుల్లంకలో ఉచిత ఇసుక క్వారీ ప్రారంభం


గాజుల్లంక డంపింగ్ యార్డులో లారీకి ఇసుక లోడ్ చేస్తున్న చిత్రం

కొల్లూరు డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉచిత ఇసుక క్వారీని సోమవారం ప్రారంభించారు. మండల పరిధిలోని గాజుల్లంక, జువ్వలపాలెం వద్ద ఉన్న కృష్ణానదిలో మైనింగ్ అధికారులు ఉచిత ఇసుక తవ్వకాల కోసం ఒక్కో రీచ్‌లో 74 వేల టన్నుల ఇసుకను గుర్తించి టెండర్లు పిలిచారు. ఒంగోలుకు చెందిన తులసీ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ టన్ను ఇసుక రూ.115 చొప్పున టెండర్లు వేసింది. టెండర్‌లో రెండు రీచ్‌లో ఇసుక తవ్వకాలు చేసేందుకు అనుమతులు దక్కించుకుంది. సోమవారం ఆన్‌లైన్‌లో ఇసుక కావాల్సిన వారు నమోదు చేసుకోవడంతో వారికి డంపింగ్ యార్డు నుంచి ఇసుక వాహనాలకు లోడ్ చేస్తున్నారు. ఉచిత ఇసుక రవాణా చేసేందుకు అవసరమైన యాప్‌ను కలెక్టర్ ప్రత్యేకంగా నియమించిన అమృతలూరు మండల అధికారి బి.నరసింహారావు ప్రారంభించారు. ఆన్‌లైన్, గ్రామ సచివాలయాల ద్వారా ఇసుక బుక్ చేసుకునే అవకాశాన్ని మైనింగ్ అధికారులు సోమవారం నుంచి కల్పించారు. టన్ను ఇసుక రూ.146 చొప్పున చెల్లించి ఇసుక బుక్ చేసుకోవాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

ఘనంగా అయ్యప్పస్వామి పంచ మండపాల పూజ


పడిపూజలో పాల్గొన్న అయ్యప్పలు, శివస్వాములు, భవానిలు

రేపల్లె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 12వ వార్డు టెలిఫోన్ ఎక్సేంజ్ వద్ద హరిహరసుతుడైన అయ్యప్పస్వామి పంచమండపాల పడిపూజా కార్యక్రమం గుంటుపల్లి శ్రీనివాసరావు గురుస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత విఘ్నేశ్వర పూజ, సుబ్రహ్మణ్యేశ్వరపూజ, శివపార్వతుల పూజ నిర్వహించి అనంతరం రావి బుచ్చియ్యచౌదరి అయ్యప్పస్వామి విగ్రహానికి పంచామృతాల పూజ చేశారు. భజన కార్యక్రమం గోపిగురుస్వామి, సత్యనారాయణ గురుస్వామి, శేషాకృష్ణస్వామి, రఘుగురుస్వామి ఆధ్వర్యంలో భజన కీర్తనలు ఆలపించారు. ఈ భజనలకు వందలాదిగా అయ్యప్పలు, శివస్వాములు, భవానిలు పాల్గొన్నారు. స్వాములకు భిక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు.

మున్సిపల్ హైస్కూల్‌లో మరమ్మతులు ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బాపట్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : 'శిథిలమౌతున్న భవనంలోనే విధులు....పనిచేయని వాటర్‌ప్లాంట్, నిరుపయోగంగా నాడు-నేడు పనులు' అంటూ 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్ పాతభవనం స్లాబ్ అనేక చోట్ల దెబ్బతిని పెచ్చులూడి పడుతున్నది. దీనికి మరమ్మతులు చేస్తున్నారు. అదేవిధంగా నాడు-నేడు కింద ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌కు కూడా మరమ్మతులు చేసి సోమవారం నీటి సరఫరాను పరిశీలించారు. అదేవిధంగా నూతన భవనం ఎదుట ఇసుక ఉండటంతో ఆ ప్రాంతంలో గ్రావెల్ ఏర్పాటు చేశారు. ఇండోర్‌స్టేడియం పక్క గేటు నుంచి మున్సిపల్ హైస్కూల్‌లోకి వచ్చే విధంగా రోడ్డు నిర్మాణం చేపట్టారు.


మున్సిపల్ హైస్కూల్‌కు వెళ్ళేందుకు ఏర్పాటు చేస్తున్న రోడ్డు


ప్యాచ్ వర్క్ చేస్తున్న కార్మికుడు

అర్జీలను పూర్తి స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలి

● జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్


జేసీ ప్రఖర్‌జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న చిత్రం

బాపట్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారవేదికలో ప్రజలు నుంచి వచ్చిన అర్జీలను పూర్తి స్థాయిలో పరిశీలించి పరిష్కరించటానికి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని జేసీ నిర్వహించారు. ఆయా ప్రాంతాలు నుంచి వచ్చిన వారి అర్జీలను స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో భూ ఆక్రమణలకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని పరిశీలించటానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. భూ ఆక్రమణలపై మండలస్థాయిలో అధికారులు ప్రతి గురువారం ప్రజలు నుంచి అర్జీలు తీసుకొని పరిష్కరించటానికి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్, జిల్లా సహకారశాఖాధికారి శ్యామ్‌సన్, జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారిణి జె.రాజాదెబోరా, జిల్లా ఉద్యానవనశాఖాధికారి జెన్నెమ్మ, మార్కెటింగ్ శాఖ ఏడీ రమేష్‌బాబు పాల్గొన్నారు.

వరదలలో నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవాలి

బాపట్లరూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానది వరదలలో నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం రూ.10 వేల చొప్పున సహాయం ఇప్పించాలంటూ సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల ప్రజావేదికలో కలెక్టర్‌కు కొల్లూరు మండలం కిష్కిందపాలెం గ్రామానికి చెందిన ప్రజలు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు టి.మోషే, సంగీతరావు, కె.ద్వారాకా, పి.దివ్య, పి.శాంతకుమారి, కె.చిన్నమ్మాయి, భారతి, మార్తమ్మ పాల్గొన్నారు.

● బాపట్ల మండలం భర్తీపూడిలో అక్రమ లేఅవుట్‌లపై చర్యలు తీసుకోవాలంటూ భర్తీపూడి సర్పంచ్ అచంట అమరేష్ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినపత్రాన్ని అందజేశారు.

ప్రజాసమస్యల పరిష్కారవేదికకు పది అర్జీలు

రేపల్లె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు పది అర్జీలు వచ్చాయి. చెరుకుపల్లి మండలం రాంబోట్లవారిపాలెం గ్రామంలో రైస్‌మిల్లు నిర్మాణం జరుగుతుందని, నిర్మాణం పూర్తయిన తర్వాత దాని నుంచి వచ్చే కాలుష్యం వలన చుట్టుపక్కల ప్రజలు ఇబ్బంది పడతారని రైస్‌మిల్లు నిర్మాణాన్ని ఆపి వేయాలని గ్రామానికి చెందిన దామెర్ల రాజారావు, రమణారావు, శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు చేశారు. చెరుకుపల్లి మండలం గూడవల్లి గ్రామానికి చెందిన డి.వసంతబాబు రేపల్లె ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డిపో అధికారులు తనను వేధిస్తున్నారని తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ అర్జీ దాఖలు చేశారు. పట్టణంలోని 13వ వార్డుకు చెందిన బేతాళ నాగేశ్వరరావు విద్యుత్ స్తంభం నడకమార్గం మధ్యన అడ్డుగా ఉందని దానిని మార్చాల్సిందిగా కోరారు. బేతపూడి గ్రామానికి చెందిన చీకటి బుల్లికోటయ్య డ్రెయినేజీ కాలువను సర్వే చేసి కాల్వ పూడికతీత చేయించవల్సిందిగా కోరారు. నగరం మండలం కొలగానివారిపాలెం గ్రామానికి చెందిన చిలకా సునీత తన పొలంను ఆన్‌లైన్ చేయించాల్సిందిగా కోరారు. ఈ సమస్యలను ఆయా అధికారులకు తెలియజేసి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు.

ప్రజల చట్టపరమైన సమస్యల పరిష్కారానికి కృషి : ఎస్పీ

బాపట్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజల చట్టపరమైన సమస్యలు పరిష్కరించటానికి ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 55 మంది అర్జీలు అందజేశారు. కుటుంబ సమస్యలు, అత్తారింటి వేధింపులు, ఆర్థిక మోసాలు, భూవివాదాలు, ఇతర పలురకాల సమస్యలను చెప్పుకోవటానికి అర్జీదారులు విచ్చేశారు. ఎస్పీ వారితో ముఖాముఖీ మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకొని అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించారు. సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్‌చేసి అర్జీలను వేగవంతంగా విచారించి చట్టపరిధిలో నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టిపి విఠలేశ్వర్, సీసీఎస్ డిఎస్పీ పి.జగదీష్‌నాయక్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.


హెలీప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ


హెలీప్యాడ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్ డూడి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన నేపథ్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు పేరెడ్‌గ్రౌండ్‌లో ఉన్న హెలీప్యాడ్‌ను సోమవారం సిబ్బందితో కలిసి ఎస్పీ తుషార్ డూడి పరిశీలించారు. హెలీప్యాడ్ ఏర్పాటు చేసే ప్రదేశాన్ని, బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌ను, నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనాన్ని, చుట్టుపక్కల ప్రదేశాలను పోలీసు అధికారులతో కలిసి ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి వెళ్ళటానికి అనుకూలంగా ఉన్న ప్రవేశమార్గాలను ఏర్పాటు చేయటం గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విలువలకు కట్టుబడిన నాయకుడు విజయబాబు

● జన్మదిన వేడుకల్లో ఆనందబాబు, ఆలపాటి


విజయబాబు బర్త్‌డే కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు, మాజీ మంత్రి ఆలపాటి

వేమూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విలువలకు కట్టుబడిన నాయకుడు జొన్నలగడ్డ విజయబాబు అని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కొనియాడారు. సోమవారం స్థానిక ఎన్టీఆర్ పురవేదిక వద్ద బాపట్ల పార్లమెంటరీ స్థాయి అధికార ప్రతినిధి విజయబాబు జన్మదిన వేడుకలను పార్టీశ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు చావలి గ్రామ సర్పంచ్ విష్ణుమొలకల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. తొలుత టీడీపీ విభాగాల శ్రేణులు విజయబాబును భారీ ఊరేగింపుతో వేదిక వద్దకు తోడ్కొని వచ్చారు. ఆనందబాబు, ఆలపాటి బర్త్ డే కేక్ కట్ చేశారు. టీడీపీ, జనసేన పార్టీల శ్రేణులు విజయబాబును సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ సీనియర్ నాయకులు మైనేని మురళీకృష్ణ, నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్, రాష్ట్ర పార్టీ నాయకులు తూనుగుంట్ల సాయిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు దండే వెంకటసుబ్బారావు, మొవ్వా శరత్ చంద్ర, శివారెడ్డి, షేక్ హనీఫ్, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, మహిళా విభాగాల సభ్యులు పాల్గొన్నారు. వేమూరు టీడీపీ యువత ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

భట్టిప్రోలులో లక్ష్మీదేవి వ్రతాలు


లక్ష్మీదేవి వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు

భట్టిప్రోలు (కొల్లూరు) డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మార్గశిర మాసం విష్ణుమూర్తి, లక్ష్మీదేవికి ప్రీతికర మాసం కావడంతో భక్తులు సామూహిక లక్ష్మీదేవి వ్రతాలు నిర్వహించారు. భట్టిప్రోలులోని వేణుగోపాలస్వామి ఆలయంలో మార్గశిర పాడ్యమి పురస్కరించుకుని సామూహిక కుంకుమ పూజలు, వ్రతాలు నిర్వహించారు. తెనాలికి చెందిన మానేపల్లి నరసింహారావు జ్ఞాపకార్థం ఆయన ధర్మపత్ని లక్ష్మీసరోజిని అమ్మవారి పూజా, ప్రసాదాల నిమిత్తం రూ.లక్షా 116లు విరాళంగా అందజేశారు. రాజ్యలక్ష్మి భజన మండలి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మానేపల్లి ఉమామహేశ్వరి, కొల్లూరి అనూష, శైలజాకుమారి, యశోద దేవి, బూరెల అరుణకుమారి, శారద, హేమలత, ధనలక్ష్మి, మహి తదితరులు పాల్గొన్నారు.

విడిపోతాం

భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు వెన్నుముక లాంటి వివాహ వ్యవస్థకు బీటలు వారుతున్నాయా....... "మూడు ముళ్లు, ఏడు అడుగులు,వందేళ్లు" అనే లెక్క తప్పుతుందా....... వైవాహికం లాంటి కీలకమైన బాధ్యతను తీసుకునేందుకు యువత విముఖత చూపుతున్నారా...... ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే అవుననే సమాధానం వస్తుంది.......చాలా మంది యాంత్రిక జీవితానికి అలవాటుపడి చిన్నపాటి కారణాలకే దూరం అవుదామని నిర్ణయించుకుని కోర్టు దాక వెళ్తున్నారు. దీనికి తోడు పరిష్కరించాల్సిన చుట్టుపక్కలవారు కూడా వీరికి మద్దతు తెలుపుతున్నారు. దాంపత్యం అంటే ఆకర్షణ, ప్రేమ కాదని అది స్పృహతో కూడిన అవగాహన, స్పృహతోకూడిన స్నేహం అని అర్థం చేసుకోలేక పోతున్నారు. ఒకరి భావాలను ఒకరు అర్థం చేసుకోకుండా.... ఆలోచనల్ని గౌరవించడం లేదంటూ వేదనకు గురవుతున్నారు. దీంతో నూరేళ్లు ఉండాల్సిన దాంపత్య జీవితాలు మధ్యలోనే ముగుస్తున్నాయి. అత్యంత పటిష్టమైన పెళ్లి అనే బంధం చిన్న చిన్న కారణాలతోనే తెగిపోతున్నది. ఈ మాత్రం దానికే విడాకులు తీసుకుంటున్నారా అంటూ న్యాయమూర్తులే విస్తుపోతున్నారు.



● పెళ్లైన నాలుగు నెలలు తిరగక ముందే టీవీ రిమోట్ దగ్గర మొదలైన గొడవ చినికి, చినికి గాలి వానలా మారి విడాకుల కోసం గుంటూరుకు చెందిన ఓ జంట కోర్టులో కేసువేశారు. ఏడాది వరకు విడాకులు ఇవ్వరని చెప్పడంతో అయితే అప్పుడే వస్తామని అంతేగాని కలసి ఉండటం కుదరదని చెప్పి అక్కడి నుంచి వెళ్ళారు.

● మరో కేసులో పెళ్లి తరువాత పెట్టుపోతలు సరిగా చేయలేకపోయారని వరుడు కుటుంబానికి చెందిన వారు మాట్లాడిన మాటలు గొడవగా మారడంతో గుంటూరుకు చెందిన ఇరు కుటుంబాలు విడాకుల కోసం కోర్టుకు ఎక్కారు.

● మా అమ్మ, నాన్న మా ఇంటికి వచ్చినపుడు చికెన్ తీసుకురాలేదని భార్య చేసిన గొడవ కోర్టు మెట్లు ఎక్కేవరకు తీసుకు వచ్చింది. చెప్పిన సమయానికి రాలేదనే.... ఇష్టమైన సినిమాకి తీసుకుపోలేదనే వంటి కారణాలకే కోర్టు వరకు వచ్చే ఘటనలు మరెన్నో...... గతంలో గురక పెడుతున్నాడని, తలుపుకు తాళం వేయడం మరిచిపోయారని వంటి కారణాలతో విడాకులు తీసుకున్నారనే వార్తలు విని నవ్వుకునేవాళ్లం... ప్రస్తుతం ఆ సంస్కృతి మన మధ్యలోకే రావడం విచారించదగ్గ విషయం.

గుంటూరు(తూర్పు), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బలమైన బంధానికి నాంది కావాల్సిన అడుగులు తప్పటడుగులు అవుతున్నాయి. కుటుంబవ్యవస్థను భావితరాలకు అందించే వివాహవ్యవస్థ బలహీనపడుతుంది. వందేళ్ల కలసి బతకాల్సిన జీవితం చిన్నపాటి కారణాలతో విడిపోతున్నారు.



విడి విడిగా మంచి భర్త, మంచిభార్యగా ఉన్నవారు కూడా ఒక్కో సమయంలో మంచి భార్యభర్తలు కాలేరన్న సూత్రాన్ని గ్రహించలేకపోతున్నారు. పెళ్లైన ఆరు రోజుల నుంచి ఆర్నెల్లు గడవకముందే భాగస్వామి అర్థం కావడం లేదనో, అర్థం చేసుకోవడం లేదనో విడిపోవాలను కుంటున్నారు. ఒకరికి ఒకరు అర్థంగాకపోయినా జీవితాంతం కలిసి ఉండే బలమైన బంధమే దాంపత్యజీవితం అని గుర్తించ లేకపోతున్నారు. నిర్లిప్తత, ఒంటరితనం. ప్రేమరాహిత్యం, అస్పష్ట అపజయం అంటూ అర్థం లేని పేర్లు పెట్టి ఎవరి దారి వారు చూసుకుంటున్నారు.

● మూణ్ణాళ్ల ముచ్చటగా వివాహబంధం
● భారీగా పెరుగుతున్న విడాకుల కేసులు
● ఉమ్మడి జిల్లాలో వేల సంఖ్యలో పెండింగ్ కేసులు
● కేసుల్లో 80 శాతం కొత్తగా పెళ్లైన జంటలవే
● చిన్నపాటి వివాదాలకే కోర్టు మెట్లెక్కుతున్న నవదంపతులు
● అక్కరకు రాని కౌన్సిలింగ్ కేంద్రాలు



పెరుగుతున్న కేసులు

గుంటూరు కార్పొరేషన్ పరిధిలో జిల్లా కోర్టులో ఉన్న ఫ్యామిలీ కోర్టులో ప్రతినెల 40కు పైగా జంటలకు విడాకులు మంజూరు అవుతున్నాయి. అంటే సరాసరిని రోజుకు రెండు జంటలు వివాహ బంధానికి స్వస్తి చెబుతున్నాయి. అంతేగాక కార్పొరేషన్ పరిధిలో నవంబరు చివరినాటికి 3వేలకు వరకు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. నెలకు జిల్లాలోని అన్ని కోర్టుల్లో నెలకు 160 వరకు జంటలు విడాకులు పొందుతున్నాయి. ఫ్యామిలీ కోర్టుతో పాటు, జిల్లా కోర్టులో నాలుగు సబ్‌కోర్టులు, నరసరావుపేట, బాపట్ల, పిడుగురాళ్ల, వినుకొండ తో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న దాదాపు 10 సబ్‌కోర్టుల్లో నిత్యం వీటి విచారణ కొనసాగుతుంది. సివిల్, క్రిమినల్ కేసుల కంటే అత్యధికంగా విడాకుల కేసులే విచారణ జరుగుతున్నాయంటే పరిస్థితి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

అక్కరకు రాని కౌన్సెలింగ్ కేంద్రాలు

సాధారణంగా విడాకులకు దరఖాస్తు చేసుకున్న దంపతులను కలిపేందుకు తొలిప్రయత్నంగా కౌన్సెలింగ్ కేంద్రాలకు పంపుతారు. దంపతుల మధ్య గొడవకు కారణం కనుక్కోని వారి మధ్య సఖ్యతను కుదర్చడమే ఈ కేంద్రాల ముఖ్య విధి. కానీ జిల్లాలో కౌన్సిలింగ్ కేంద్రాలకు వెళ్లిన వారికి న్యాయం జరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దిశ పోలీస్ స్టేషన్లలో, సఖి కేంద్రాల్లో జిల్లా వ్యాప్తం గా కౌన్సెలింగ్ సెంటర్లను ఏర్పాటు చేశా రు. కానీ ఇక్కడ సరైన మానసిక నిపుణు లు, అనుభవజ్ఞులు లేక చాలా కేసులు తిరిగి విడాకులకే దారి తీస్తున్నాయి. ఇతర రాష్ట్రాల మాదిరి గతంలో విడాకులు తీసుకుని ఒంటరితనం గడుపుతున్న వారి జీవితానుభవాల్ని వివరించే విధానాన్ని తీసుకువస్తే కొంతమేర ఫలితాలు ఉండవచ్చని నిపుణులు చెబుతున్నారు.



జిల్లా కోర్టులోని ఫ్యామిలీ కోర్టు భవన నిర్మాణ సముదాయం

పెద్దవారు లేకపోవడమే కారణం..

గతంలో విడాకుల కేసులు చాలా అరుదుగా వచ్చేవి. ప్రస్తుతం అవి వందల సంఖ్యలో వస్తున్నాయి. జిల్లా కోర్టులోనే నాలుగు సబ్‌కోర్టుల్లో విచారణ కొనసాగుతున్నాయి, ఉమ్మడి కుటుంబాలు, పెళ్లైన కొత్తలో పెద్దవారి పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణం. ఒక్కసారి భార్యాభర్తల్లో ఒకరు కలిసి ఉండాలని మరొకరు విడిపోవాలని కోరుకుంటారు. ఇటువంటి కేసులు కూడా వస్తుంటాయి. విడాకులు వద్దని ఎంత చెప్పినా వినరు. తీసుకున్న తరువాత వచ్చే ఇబ్బందులు గురించి చెప్పినా పట్టించుకోరు. చిన్నపాటి సమస్యలు వచ్చినపుడు విడాకులు వరకు రావడం మంచిది కాదు. పెద్దవారి సమక్షంలో ఇరుకుటుంబాలు ఆరోగ్యకరమైన వాతవరణంలో పరిష్కరించుకోవాలి.



పల్లపు కృష్ణ, 5వ కోర్టు అదనపు జిల్లా జడ్జి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్

● పెళ్లయిన కొత్తలోనే సమస్య

అప్పటి వరకు ఉన్న వాతావరణం, ఆప్తులు పెళ్లి తరువాత కనిపించవు. అక్కడి పరిస్థితులు అర్థం చేసుకోవడానికి కొంత సమయం పడుతుంది. ఈ సమయంలోనే చిన్నపాటి స్పర్థలు మొదలవుతాయి వీటిని పరిష్కరించుకోగలిగితే ఆ తరువాత ఎటువంటి ఇబ్బందులు ఉండవు. జీవితం రొటీన్ అవుతుందన్న భావన కూడా రానివ్వకూడదు. అంతేగాక బయటకు వెళ్లినపుడు ఒకరినొకరు గౌరవించుకోవాలి. గొడవలు జరిగితే సర్దుకుపోవాలి. చిన్నపాటి సూత్రాలు పాటించుకుంటే వివాహ జీవితం ఆనందంగా ఉంటుంది.



-డాక్టర్ వి వెంకట కిరణ్, మానసిక వైద్య నిపుణుడు, జీజీహెచ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, జీఎమ్‌సీ

● 80శాతం యువజంటలవే.....

విడాకుల కోసం కోర్టుకు వెళ్తున్నవారిలో 80 శాతం 25-28 మధ్య వయస్సుల గల జంటలవే. విడాకుల కోసం వీరు చెప్పే కారణాలు కూడా విచిత్రంగా ఉంటాయి. ఇంత చిన్న సమస్యకు విడాకుల వరకు వస్తున్నారా అంటే అది మీకు చిన్నది కావచ్చు మాకు మాత్రం చాలా పెద్దది అంటూ సమాధానం చెబుతున్నారు. ఒకరిపై ఒకరికి విపరీతమైన అంచనాలు, ఊహించుకునే విధంగా వైవాహిక జీవితం లేకపోవడం, ప్రతి మాటకు విపరీత అర్థాలు తీయడం, ఆర్థిక భద్రత ఉండటంతో ఎలాగైన జీవించగలం అనే ధీమా. సర్దిచెప్పేవారు లేకపోవడం, లేనిపోని అపోహలు వంటి కా రణాలు విడాకుల వరకు దారితీస్తున్నాయి. సంసారంలో జరిగే ప్రతి చిన్న సంఘటనను ఇతరులతో పంచుకోవడం ఈ మధ్య అలవాటుగా మారింది. ఇది కూడా దంపతుల మధ్య ఘర్షణలకు కారణమవుతున్నాయి.

● మూడో వ్యక్తి ప్రమేయమే కారణం

దంపతుల మధ్య జరిగే గొడవల్లో మూడోవ్యక్తి జోక్యం వల్లే పరిస్థితి చేయిదాటుపోతుందని నిపుణులు చెబుతున్నారు. పెళ్లికి ముందు మనకు ఏ సమస్య వచ్చినా స్నేహితులతో పంచుకుంటాం. కాని పెళ్లి తరువాత ఏది స్నేహితులతో చెప్పుకోవాలి...ఏది కుటుంబ సభ్యులతో చెప్పుకోవాలి అనే అవగాహన చాలామందికి ఉండదు. దీంతో మూడోవ్యక్తి సలహాలను పాటించి సమస్యను జటిలం చేసుకుంటున్నారు.

● విడాకుల తరువాత తీవ్ర మనోవేదన

ఇక్కడ ఆసక్తికర విషయమేంటంటే అప్పటివరకు విడిపోవాలనుకున్నా ఒకసారి విడాకులు పొందిన తరువాత దంపతు లిద్దరూ తీవ్రమనోవేదన అనుభవిస్తారు. విడాకుల తీసుకున్న వారి పట్ల సమాజం వ్యవ హరించే తీరు, ఒంటరై పోయామనే భావన, ఇతరులు కుటుంబాలతో సంతోషంగా ఉండటం, పెళ్లైన కొత్తలో సంతోషంగా గడిపిన క్షణాలు గుర్తుకు రావడం వంటి కారణాలతో తీవ్రమానసిక వేదన అనుభవిస్తుంటారు.



మాఫియా పరేషన్!

(5వ పేజీ తరువాయి)

చీకటి పడిన వెంటనే బియ్యాన్ని తరలించుకుపోతున్నారు. అందుకోసం మాఫియా ప్రైవేటు వాహనాలు కొనుగోలు చేసి వాటిని ఏరోజుకారోజు తరలించుకుపోతున్నారు. వాటితోపాటు పేదలకు బియ్యాన్ని సరఫరా చేయాల్సిన ఎండీయూ వాహనాల్లోనే కొందరు బియ్యాన్ని మాఫియాకు తరలిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారం మాఫియా సిండికేట్ కనుసన్నల్లోనే జరగడం విశేషం.

● బినామీ షాపులతో మాయ

జిల్లాలో చాలా షాపులు రేషన్ మాఫియా కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. ఉదాహరణకు గుంటూరు నగరంలో వున్న 204 రేషన్ షాపుల్లో 40కి పైగా రేషన్ షాపులు రేషన్ మాఫియా డాన్ అదుపులోనే వున్నాయి. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రేషన్ డాన్ వాటిల్లో పెట్టుబడులు పెట్టి పేదల బియ్యం అక్రమ మార్కెట్ మొత్తాన్ని తన గుప్పెట్లో పెట్టుకున్నాడు. షాపుల్లో వచ్చే సరుకు వ్యత్యాసాలను మిగిలిన షాపులతో అనుసంధానం చేసి ఎవరికీ తెలియకుండా బియ్యాన్ని తరలించుకుపోతున్నారు. విధిలేని పరిస్థితిలో దొరికిపోతే 'డాన్' రంగప్రవేశం చేసి చక్కదిద్దుతాడు. ఆరోపణలు వచ్చి డీలర్షిప్పుకు ప్రమాదం వస్తే డీలర్షిప్ బదిలీ బాధ్యత కూడా తీసుకుని తన అనుయాయులకే డీలర్షిప్ వచ్చేలా పావులు కదుపుతూ మాఫియాను ఏకచత్రాధిపత్యంతో నడుపుతున్నారు. ఇలా ఎక్కడికక్కడ మాఫియా సిండికేట్ వ్యవహారాలను చక్కబెట్టి యథేచ్ఛగా పేదల బియ్యాన్ని కొల్లగొడుతోంది.

● మాఫియాకు మిల్లర్ల దన్ను

రేషన్ మాఫియా అక్రమాలకు మిల్లర్లు దన్నుగా నిలుస్తున్నారు. జిల్లాలోని పెద్ద పెద్ద మిల్లర్లందరినీ మాఫియా సిండికేట్లో భాగస్వాములను చేసుకుని వారి మిల్లుల్లోనే బియ్యాన్ని ప్రాసెసింగ్ చేస్తున్నారు. ఎండీయూ వాహనదారుల దగ్గర, రేషన్ డీలర్ల దగ్గర రూ. 16 నుంచి 21 రూపాయలకు కొనుగోలు చేసిన బియ్యాన్ని మిల్లులకు తరలించి, ప్రాసెసింగ్ చేసి సన్నబియ్యం పేరుతో మార్కెట్లోకి రూ. 55 నుంచి 60 రూపాయలకు చలామణీ చేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ చేపట్టిన తనిఖీల్లో 200 టన్నుల రేషన్ బియ్యం రైస్ మిల్లర్ల దగ్గర దొరికింది. రవాణాకు సిద్ధంగా వున్న లారీలను కూడా ఆయన సీజ్ చేశారు. జిల్లాలో రేషన్ మాఫియా ఎంత బలంగా వుందనేది మంత్రి స్వయంగా చేపట్టిన తనిఖీల్లో వెల్లడయింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం పేదల బియ్యం అక్రమాలపై దృష్టి సారించింది.

మిర్చి యార్డులో కలవరం

(5వ పేజీ తరువాయి)

మిర్చియార్డులో పర్సన్ ఇంచార్జిలుగా కొనసాగారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇటువంటి పద్ధతిలో కొనసాగిన అధికారుల నేతృత్వంలో అక్రమాలు జరిగినట్లు విజిలెన్స్ నిర్ధారించింది. వారి పేర్లను కూడా ప్రభుత్వానికి అందజేసిన నివేదికలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ఇక్కడ పనిచేసిన ఇద్దరు సెక్రటరీలు భారీ అవినీతికి పాల్పడినట్లు నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. వారి కనుసన్నల్లోనే అన్ని వ్యవహారాలు జరిగినట్లు నిర్ధారించారు. రాజకీయ నేతల అడుగులకు మడుగులొత్తి యార్డు ఆదాయానికి పూర్తిస్థాయిలో గండికొట్టారు. ఈ-నామ్ పోర్టల్ నిర్వహణలోనూ, కటింగ్ వ్యాపారం ప్రోత్సహించటంలోనూ వీరిది కీలక పాత్ర అని తేల్చారు. లైసెన్స్‌ల రెన్యూవల్ వ్యవహారంలో ఒక సెక్రటరీ ఏకపక్షంగా వ్యవహరిచినట్లు తేలింది. మొత్తం 286 లైసెన్స్‌లు ఉండగా, కేవలం 56కు మాత్రమే త్రిసభ్య కమిటీ అనుమతి పొందారు. మిగిలిన వాటికి సెక్రటరీనే రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు మామూళ్లు తీసుకొని రెన్యువల్ చేసినట్లు తెలుస్తోంది. గడచిన ఐదేళ్ల కాలంలో ఇదే సెక్రటరీలను మార్చి మార్చి యార్డు విధుల్లో నియమించారు.

లక్షల క్వింటాళ్ల మిర్చి ఈ-నామ్‌లో పెండింగ్

యార్డులో అవినీతి, అక్రమాలు జరిగేందుకు అన్ని స్థాయిలో సిబ్బంది సహకరించారు. యార్డుకు వచ్చిన మిర్చిని ఈ-నామ్‌లో అప్‌లోడ్ చేయటం, దాన్ని క్లియర్ చేయటంలో మితిమీరిన నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు తెలుస్తోంది. కొద్ది రోజుల క్రితం వరకు కూడా సుమారు 13 లక్షల క్వింటాళ్ల మిర్చికి సంబంధించి ఈ-నామ్‌లో పెండింగ్ స్టేటస్ చూపించినట్లు విచారణలో తేలింది. ఉద్దేశ పూర్వకంగానే ఇటువంటి పనులు చేసి జీరో, కట్ బిజినెస్‌కు ఇంచార్జీలు, సూపర్‌వైజర్లు సహకరించినట్లు తెలుస్తోంది. ఎగుమతి, దిగుమతి వ్యాపారులతో చేతులు కలిపిన సిబ్బంది రైతుల ప్రయోజనాల కు కూడా దెబ్బ కొట్టినట్లు నిర్ధారణ అయ్యింది.

సబ్ జూనియర్స్ విభాగంలో

ప్రకాశం జిల్లా ఎడ్లజత ప్రథమం

కారంపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక కొత్త బస్టాండ్ వద్ద సోమవారం సబ్ జూనియర్స్ విభాగంలో ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్‌లు ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రకాశం జిల్లా మద్దిరాల మండలం, నాగలుప్పలపాడుకు చెందిన పుచ్చకాయల శేషాద్రిచౌదరి ఎడ్లజత నిర్ణీత సమయంలో 2600 అడుగుల దూరం పందెపు బండను లాగి ప్రథమస్థానం, గుంటూరు జిల్లా లింగాయపాలెంకు చెందిన యల్లం సాంబశివరావు ఎడ్లజత 1800 అడుగులతో రెండోస్థానం, తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన రోహన్ బాబు ఎడ్లజత 1683 అడుగులతో మూడోస్థానంలో నిలిచాయి. విజేత ఎడ్లజతల యజమానులకు సర్పంచ్ బాణావత్ సరస్వతి బాలునాయక్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజినేయులు, మాజీ ఎంపీపీ ర మావత్ నాగులునాయక్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, కంభంపాటి సత్యనారాయణ, సంగినేటి బాలకృష్ణలు బహుమతులను అందించారు. మంగళవారం జూనియర్స్ విభాగంలో పోటీలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ప్రథమస్థానంలో నిలిచిన ప్రకాశం జిల్లా ఎడ్లజత

శిల్పారామాన్ని సందర్శించిన నూతన సీఈవో, చైర్‌పర్సన్

గుంటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని అడవి తక్కెళ్లపాడు సమీపంలో ఉన్న శిల్పారామంలో సోమవారం రాష్ట్ర శిల్పారామాల నూతన సీఈవో వీ స్వామినాయుడు, చైర్‌పర్సన్ చేర్రెడ్డి మంజులా రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గుంటూరు శిల్పారామం కార్యాలయ, ఫీల్డ్ సిబ్బందితో మాట్లాడారు. శిల్పారామం మొత్తం కలియతిగిరి స్టాల్స్, బోటింగ్ పాండ్, గార్డెన్ పరిశీలించారు. బోటింగ్ పాండ్ ఏర్పాటు త్వరగా అయ్యే విధంగా తగిన ఏర్పాట్లను చేయాలని సూచిం చారు. ఫిర్యాదుల పుస్తకాన్ని సందర్శకులకు అందుబాటులో ఉంచాలని, వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిల్పారామం ఏవో శ్రీనివాస్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ నాగార్జున, డీఈవో భవాని ఇతర సిబ్బంది ఉన్నారు



శిల్పారామాన్ని సందర్శిస్తున్న స్వామినాయుడు, మంజులారెడ్డి

కృష్ణమ్మకు కార్తీక వెలుగు..

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) కార్తీకమాసం ముగిసిన మరుసటి రోజు పోలి పాడ్యమి పర్వదినం పురస్కరించుకుని వేలాది మంది భక్తులు వెలిగించిన కార్తీక దీపాలతో కృష్ణాతీరం కాంతులీనింది. సోమవారం ఉదయం పోలిస్వర్గం పేరుతో కార్తీకదీపాలను వెలిగించి పవిత్ర కృష్ణానది అలలపై వదిలేందుకు భక్తులు ఆదివారం రాత్రి అమరావతి ఆలయ ప్రాంగణంలోనే బస చేశారు. తెల్లవారు జామునే నిద్రచేసి కృష్ణానదిలో స్నానమాచరించి స్నానఘాట్ వద్ద కార్తీక దీపాలను వెలిగించి అరటి బొదెలపై ఉంచి నదిలో వదిలారు.



కృష్ణమ్మ అలలపై కార్తీక దీపాలను వదులుతున్న భక్తులు

ముగిసిన మందపోరు

● వివిధ జిల్లాల హాజరైన వీరాచవంతులు
● కొణతాలకు నాగులేటిలో స్నానాలు.. ఊరేగింపు
● అంకాళమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు
● నేడు ప్రధాన ఘట్టం 'కోడిపోరు'

మండల కేంద్రమైన కారంపూడిలో నిర్వహిస్తున్న పల్నాడు వీరారాధన ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన సోమవారం మందపోరు నిర్వహించారు. ఆవుల మందకు కాపలాగా ఉన్న గోపన్నను నాగమ్మ సైన్యం హతమార్చిన సంఘటన గురించి గానం రూపంలో ఆలపించారు. పీఠం నిర్వాహకులు బొగ్గరం విజయ్‌కుమార్ అయ్యవారు వివిధ జిల్లాల నుంచి వచ్చిన వీరాచారవంతులకు కంకణదారణ చేశారు. మందపోరు ఘట్టాన్ని విజయవంతంగా ముగించారు. ఉత్సవాల్లో ప్రధానమైన కోడిపోరు ఘట్టాన్ని మంగళవారం నిర్వహించనున్నారు.

కారంపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ముందుగా వచ్చిన వీరాచార వంతులు తమ కొణతములకు నాగులేటిలోని గంగధారమడుగులో స్నానమాచరింపజేసి అలంకరించారు. వీర్ల దేవాలయంలో పూజలు నిర్వహించి పొంగళ్లను నైవేద్యంగా పెట్టారు. అనంతరం ఊరేగింపుగా బయలుదేరి చెన్నకేశవ స్వామి, అంకాళమ్మ ఆలయాల్లో తీర్థం స్వీకరించారు. బ్రహ్మనాయుడు విగ్రహం, పీఠాధిపతి నివాసం వద్ద కత్తిసేవ చేశారు. మహిళా వీరాచారవంతులు అంకమ్మ పెట్టెలతో అమ్మవారికి సంబంధించిన వస్తువులు, గాజులు, ఫోటో, కుంకుమ తదితర సామగ్రితో తరలివచ్చారు. అందరూ ఊరేగింపుగా అంకాళమ్మ ఆలయానికి పూర్వీకుల ఆయుధాలతో వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంకాళమ్మ అమ్మవారికి కొలుపులు చేశారు. రాత్రివేళ పీఠాధిపతి తరుణ్‌చెన్నకేశవ అయ్యవారును ఇంటి వద్ద నుంచి ఊరేగింపుగా వీర్ల దేవాలయం వద్దకు తీసుకొని వచ్చారు. అక్కడ రాచగావు మండపంలో బ్రహ్మనా యుడు స్థానంలో పీఠాధిపతి ఆశీనులు కాగా వీరవి ద్యావంతులు మందపోరు కథను గానం చేశారు.

కులమతాలకు అతీతంగా చాపకూడు

● పాల్గొన్న ఎమ్మెల్యేలు, కలెక్టరు, ఎస్పీ

బ్రహ్మనాయుడు ఆశించిన సర్వమత సమ్మేళనంలో భాగంగా వీరారాధన ఉత్సవాల్లో మూడో రోజున మందపోరులో భాగంగా వీర్ల దేవాలయ ఆవరణలో చాపకూడు నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సహపంక్తి భోజనం చేశారు. 900 యేళ్ల క్రితమే కుల మతాలకు అతీతంగా చాపకూడును పల్నాటి బ్రహ్మనాయుడు నిర్వహించారు. మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావులు హాజరై సహపంక్తి భోజనం చేశారు. వీరుల దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. బ్రహ్మనాయుడు నృసింహకుంతాన్ని చేబూనారు. ముందుగా ఉత్సవాలకు విచ్చేసిన ప్రజాప్రతినిధులకు కూటమి నేతలు ఘనంగా స్వాగతం పలికి ర్యాలీ జరిపారు. పంగులూరి అంజయ్య, పుల్లయ్య, కుర్రి శివారెడ్డి, బొల్నేడి శ్రీను, చప్పిడి రాము, ఉన్నం లక్ష్మీనారాయణ, గోరంట్ల నాగేశ్వరరావు, సర్పంచ్ సరస్వతి బాలునాయక్, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్ జానీ, కర్నా సైదారావు, మోదీన్‌సా, బూసా రామాంజినేయులు, గోళ్ల సురేష్ యాదవ్, ఎస్‌పీఆర్ కృష్ణ, శంకర్, పూర్ణ, రాఘవ, షేక్ జానీబాషా, షేక్ నన్నేసా, తుపాకుల రత్తయ్య, బొల్నేడి హరికృష్ణ, కిలారి పవన్, కూటమి నేతలు పాల్గొన్నారు.



సహపంక్తి భోజనం చేస్తున్న ఎమ్మెల్యేలు బ్రహ్మరెడ్డి, అరవిందబాబు, వెంకట్రావు, కలెక్టర్ అరుణ్‌బాబు తదితరులు

నేడు కోడిపోరు

పల్నాటి వీరారాధన ఉత్సవాల్లో భాగంగా నాలుగవ రోజైన మంగళవారం ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన కోడిపోరును నిర్వహించనున్నారు. పల్నాటి యుద్ధానికి ప్రధాన కారణమైన కోడి పందెలను కోడిపోరు పేరుతో వీర్ల దేవాలయ ప్రాంగణంలో జరపనున్నారు. ఈ పోరును వీక్షించేందుకు వేలాదిగా ప్రజలు తరలిరానున్నారు.



మందపోరును గానం చేస్తున్న వీరవిద్యావంతుడు



కర్నూలు జిల్లా బాలుర జట్టుకు విన్నర్ కప్‌ను అందిస్తున్న సుధీర్‌నాయుడు

అంతర్ జిల్లా రగ్బీ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా కర్నూలు జట్లు

» రన్నర్స్‌గా సత్యసాయి జిల్లా

» నెల్లూరు బాలుర టీంకు తృతీయస్థానం

కావలిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా కావలి పట్టణంలోని మద్దూరుపాడులోగల డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల క్రీడా ప్రాంగణంలో రెండురోజులపాటు జరిగిన సబ్‌జూనియర్ అంతర్ జిల్లాల రగ్బీ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని 14 జిల్లాల నుంచి బాల, బాలికల జట్లు హాజరయ్యాయి. కర్నూలు జిల్లా బాలుర, బాలికల జట్లు అత్యున్నత ప్రతిభ కనబరిచి ఓవరాల్ చాంపియన్లుగా నిలిచాయి. బాలుర విభాగంలో రన్నర్‌గా సత్యసాయి జిల్లా జట్టు, తృతీయ స్థానంలో నెల్లూరు జిల్లా జట్టు నిలిచాయి. బాలికల విభాగంలో రన్నర్‌గా సత్యసాయి జిల్లా, తృతీయ స్థానంలో కృష్ణాజిల్లా జట్టు నిలిచాయి. ముగింపు సభలో ముఖ్య అతిథిగా డీబీఎస్ కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు పాల్గొని విజేతలకు కప్పులు, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల రగ్బీ పోటీలకు తమ కళాశాల వేదికవడం సంతోషంగా ఉందన్నారు. రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ జిల్లా కేంద్రాల్లోనే రగ్బీ పోటీల నిర్వహణకు వెనుకాడతామని, అలాంటిది కావలిలోని డీబీఎస్ యాజమాన్యం ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టీవీ రావు, పీడీ మురళి, వివిధ జిల్లాల నుంచి వచ్చిన రగ్బీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి

ప్రకాశం జిల్లా వాసిగా గుర్తింపు

దాచేపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ముందుగా వెళ్తున్న ఆటో సాంకేతిక లోపంతో అకస్మాత్తుగా ఆగిపోవడంతో, ఆటో వెనుక వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడు ఆటోను ఢీకొని తీవ్రగాయాలపాలై మృతిచెందిన సంఘటన సోమవారం పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లి వద్ద జరిగింది. మృతుడు ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలం నల్లసముద్రం గ్రామానికి చెందిన మోతుకూరి ఏడుకొండలు (32)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏడుకొండలు హైదరాబాద్ నుంచి ఒంగోలుకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన ఏడుకొండలను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. దాచేపల్లి ఎస్‌ఐ పాపారావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్జీవీకి హైకోర్టులో ఊరట

ఈనెల 9 వరకు అరెస్టు చేయవద్దని ఆదేశం

ఒంగోలు క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వివాదాస్పద సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మకు హైకోర్టులో ఊరట లభించింది. మద్దిపాడు పోలీసు స్టేషన్‌తోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో రామ్‌గోపాల్‌వర్మపై కేసులు నమోదైన విషయం విదితమే. సోషల్ మీడియాలో చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్‌లపై ఆర్జీవీ అసభ్యకరంగా పెట్టిన పోస్టులతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయని ఫిర్యాదులు చేయగా పోలీసులు కేసులు నమోదు చేశారు. అయితే అరెస్టు నుంచి మినహాయింపు కోరుతూ ఆర్జీవీ హైకోర్టును ఆశ్రయించారు. కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఈనెల 9కి వాయిదా వేసిన న్యాయమూర్తి అప్పటివరకు రామ్‌గోపాల్‌వర్మను అరెస్టు చేయవద్దని పోలీసులను ఆదేశించారు.

104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రకు వినతి

కనిగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : 104 అంబులెన్స్ సిబ్బంది సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంఎంయూ నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డిని ఆ సంఘం నాయకులు కలసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్ళు తమ స మస్యలను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చే శారు. తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజలకు ఇబ్బందులు కల్గించకుండా విధులు నిర్వ హిస్తూనే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలియజేస్తున్నట్టు చెప్పారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. గత 16 సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బందులు పడుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు.

తమ డిమాండ్లను పరిష్కరించే విధంగా సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర సానుకూలంగా స్పందించి ఉద్యోగుల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఎంయూ నాయకులు నాయబ్ రసూల్, సుధాకర్, నవీన్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న 104 యూనియన్ నేతలు

ప్రారంభానికి నోచుకోని పీహెచ్‌సీ

» పూర్తయిన నిర్మాణ పనులు

» పెచ్చులూడుతున్న భవనంలోనే కొనసాగుతున్న సేవలు



ప్రారంభించని కొత్త పీహెచ్‌సీ భవనం

మేదరమెట్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చుచేసి నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం పూర్తయి సంవత్సరమైనా ప్రారంభానికి నోచుకోలేదు. గతంలో సమితి కేంద్రం అయిన కొరిశపాడులో 60 ఏళ్లకి పూర్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించారు. ఆరోగ్య కేంద్రం భవనంతో పాటు సిబ్బందికి క్వార్టర్స్‌ను నిర్మించారు. 20 ఏళ్ల కిందటే సిబ్బంది నివా సం ఉండే క్వార్టర్స్ పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనంలో ఆపరేషన్ థియేటర్‌తోపాటు మరికొన్ని గదులు పై నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. ఆరోగ్య కేంద్ర ంలోని కొన్ని రూములలో ప్రసుత్తం కేంద్రాన్ని నడుపుతూ సేవలందిస్తున్నారు. ఎప్పుడు పెచ్చులూడి పడతాయోనని సిబ్బంది భయపడుతున్నారు.

గత ప్రభుత్వంలో కొరిశపాడు, మేదరమెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నూతన భవనాల నిర్మాణం కోసం నిధులను మం జూరు చేశారు. ఒక్కొక్కటీ రూ.1.73లక్షల అంచనాతో నిర్మాణ పనులను ప్రారంభించారు. 2023 డిసెంబర్ నాటికి 90శాతం పనులు పూర్తి అయ్యాయి. మేదరమెట్లలోని యర్రం చిన్న పోలిరెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో 2024 జనవరిలో ప్రారంభించారు. ఆయనతో ప్రారంభం చేయించడానికి మేదరమెట్లలో పీహెచ్‌సీ భవనం నిర్మించిన కాంట్రాకర్టర్‌లకు పెండింగ్ బిల్లులు అన్నీ చెల్లించారు. కొరిశపాడులో పీహెచ్‌సీ భవనం నిర్మించిన కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో ప్రారంభించకుండా వదిలేశారు. ఒక పక్క పెచ్చులూడుతున్న భవనంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్‌లు సిబ్బంది రోగులు, కొత్త భవనాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారని స్థానిక ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైన జిల్లా వేద్య, ఆరోగ్య శాఖలు నూతన భవనం ప్రా రంభోత్సవానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు సిబ్బంది కోరుతున్నారు.

ప్రకాశం జిల్లా ఎడ్లజత ప్రథమం



పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన ప్రకాశం జిల్లా ఎడ్ల జత

కారంపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక కొత్త బస్టాండ్ వద్ద సోమవారం సబ్ జూనియర్స్ విభాగంలో ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జిల్లా అధ్యక్షుడు కొమ్మాళ్లపాటి శ్రీధర్‌లు ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాలకు చెందిన పుచ్చకాయల శేషాద్రిచౌదరి ఎడ్లజత నిర్ణీత సమయంలో 2600 అడుగుల దూరం పందెపు బండను లాగి ప్రథమస్థానంలో నిలిచింది. అలాగే గుంటూరు జిల్లా లింగాయపాలెంకు చెందిన యల్లం సాంబశివరావు ఎడ్లజత 1800 అడుగులతో రెండోస్థానం, తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన రోహన్‌బాబు ఎడ్లజత 1683 అడుగులతో మూడోస్థానంలో నిలిచింది. విజేత ఎడ్లజతల యజమానులకు సర్పంచ్ బాణావత్ సరస్వతి బాలునాయక్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజినేయులు, మాజీ ఎంపీపీ రమావత్ నాగులునాయక్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, కంభంపాటి సత్యనారాయణ, సంగినేటి బాలకృష్ణలు బహుమతులను అందించారు. మంగళవారం జూనియర్స్ విభాగంలో పోటీలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ముఖహాజరు తంటా

» రోజుకు రెండుసార్లు వేయాల్సిందే » సచివాలయ ఉద్యోగుల్లో ఆందోళన

» ఒకపూట వేస్తే అది సెలవు లెక్కే » విధులకు డుమ్మాకొట్టే వారి ఆటలకు చెక్

» జిల్లావ్యాప్తంగా అమలు ప్రారంభం



ముఖ హాజరు వేస్తున్న ఉద్యోగులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేసే ఉద్యోగులు ఇక రోజు రెండుసార్లు ముఖ హాజరు వేయాల్సిందే.. ఆ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సోమవారం నుంచే అమలుచేసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల్లో ఎక్కువమంది విధులకు ఎప్పుడు వస్తున్నారో తెలియని పరిస్థితి ఏర్పడింది. గతంలో వలంటీర్లను ఏర్పాటు చేయడంతో వారి ద్వారానే సచివాలయ ఉద్యోగులు పనిచేయిస్తూ కాలం వెల్లబుచ్చారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థపై దృష్టిసారించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తనిఖీలకు వెళ్లిన సమయంలో ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగులు ఉండటం లేదు. ఈ విషయాన్ని ఎవరైనా ప్రశ్నిస్తే గ్రామంలో లేదా వార్డులో పరిశీలనకు వెళ్లారు, లేదా మండల కేంద్రానికి వెళ్లారు అంటూ రకరకాల కారణాలు చెప్తూ తప్పించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ ఉద్యోగుల ద్వారా సామాజిక పింఛన్ల పంపిణీతోపాటు ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల అమలుతోపాటు పలురకాల విధులను కేటాయించింది. వాటితోపాటు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం పూట ఇతర ఉద్యోగుల తరహాలో ముఖహాజరు తప్పనిసరిగా వేయాలని ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకు సచివాలయాల్లో ఇష్టారీతిన వ్యవహరించిన ఉద్యోగులు తాజా ప్రభుత్వ ఉత్తర్వులతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

ఆరువేల మందికి పైగా ఉద్యోగులు

సాధారణంగా ఒకపూట ముఖ హాజరు వేసి సాయంత్రం ఇంటికి వెళ్లే సమయంలో మరొకసారి హాజరు వేయాల్సి ఉంది. కానీ సచివాలయ ఉద్యోగులకు మాత్రం ఉదయం పదిన్నరలోపు, సాయంత్రం ఐదు గంటలకు తప్పనిసరిగా ముఖహాజరు ఉంటేనే ఆ రోజు విధుల్లో ఉన్నట్లు లెక్క. ఒకపూట వేయకపోయినా ఆ రోజు విధులకు డుమ్మా కొట్టినట్లే లెక్క. ఈ ముఖ హాజరు కూడా ఆ సచివాలయ పరిధిలోని 500 మీటర్ల లోపే వేయాల్సి ఉంది. ఎక్కడో కూర్చొని హాజరు వేయాలనుకుంటే ఇక కుదరదు. జిల్లాలో ఉన్న 712 సచివాలయాల్లో 6,300 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఒక్కొక్క సచివాలయంలో సరాసరిన పది విభాగాల ఉద్యోగులు ఉన్నారు. వారందరూ ఇప్పుడు తప్పనిసరిగా హాజరు వేయాల్సి రావడంతో వారిలో ఆందోళన నెలకొంది.

ఇష్టారాజ్యం ఇక కుదరదు

ఇప్పటివరకు విధులకు ఇష్టారీతిన వెళ్లిన ఉద్యోగులు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలోకి వెళ్లారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పనిచేయాల్సిన సచివాలయాల్లో కొన్ని విభాగాల ఉద్యోగులు విధులకు ఎప్పుడు హాజరవుతారో కూడా తెలియదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు నిర్ణయం తీసుకోవడంతో వారికి మింగుడు పడటం లేదు. కాగా కొన్ని విభాగాలకు చెందిన సచివాలయ ఉద్యోగులు విధులకు ఉదయం ఆరు గంటలకే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అటువంటి ఉద్యోగుల విషయంలో ఇంకా ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు. వ్యవసాయ, సర్వే, ఎఎన్ఎం, వీఆర్వో లాంటి ఉద్యోగులు నిరంతరం ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో ఉండాలి. అటువంటి ఉద్యోగులు ఉదయం వెళితే సాయంత్రం వరకు విధుల్లో ఉండాల్సి వస్తుంది. అటువంటి ఉద్యోగుల పట్ల ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందోనని ఆ విభాగాల ఉద్యోగులు వేచిచూస్తున్నారు.

» రేషన్ అక్రమాలకు పాల్పడితే కేసులు పెడతాం

» నెల రోజుల్లో 75మంది డీలర్లపై 6ఏ నమోదు

» జిల్లా వ్యాప్తంగా 3,585 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం, 42 కేసులు

» ఆంధ్రజ్యోతితో డీఎస్‌వో పద్మశ్రీ

అంతా పారదర్శకమే

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో కార్డుదారులకు రేషన్ పారదర్శకంగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నాం. కార్డుదారులకు నిత్యావసర సరుకులు అందించకుండా బయటకు తరలిస్తున్నట్లు నా దృష్టికి వస్తే అటువంటి వారిని ఉపేక్షించేది లేదు. ఈ విషయంలో ప్రభుత్వంతోపాటు కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణలు నిరంతరం పర్యవేక్షించడంతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలు, సూచనలకు అనుగుణంగా కార్డుదారులకు సరుకులు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేశాం. పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులు బ్లాక్ మార్కెట్‌కు తరలింపును అడ్డుకునేందుకు విస్తృతంగా తనిఖీలు చేసేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నాం' అని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి(డీఎస్‌ఓ) ఎస్.పద్మశ్రీ వెల్లడించారు. జిల్లాలో తమ శాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను ఆంధ్రజ్యోతికి వివరించారు.

జిల్లాలో రేషన్ మాఫియాకు అడ్డుకట్ట వేస్తారా?

జిల్లాలో పేదలకు అందాల్సిన బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే తమ శాఖతోపాటు జేసీ గోపాలకృష్ణ దృష్టికి వచ్చిన వెంటనే దాడులు చేసి బియ్యాన్ని సీజ్ చేసి, కేసులు కూడా నమోదు చేస్తున్నాం. జిల్లాలో పేదలకు అందాల్సిన బియ్యాన్ని వారికే అందేవిధంగా చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారా విస్తృతంగా తనిఖీలు చేపట్టడంతోపాటు రేషన్ షాపులపై కూడా నిరంతరం నిఘాను పెడుతున్నాం.

ఎన్ని రేషన్ షాపులపై కేసులు నమోదు చేశారు?

జిల్లాలో నెలరోజుల వ్యవధిలో 75 రేషన్ షాపులపై 6(ఏ) కేసులను నమోదు చేశాం. ఆయా షాపులకు కేటాయించిన బియ్యంలో తేడాలు ఉండటంతో కేసులు నమోదు చేశాం. గోడౌన్ నుంచి ఆ షాపునకు బియ్యం, ఇతర సరుకులు కేటాయింపులు చేసిన తర్వాత అక్కడ నిల్వలు ఉండాలి. కానీ కొన్ని షాపుల్లో తక్కువగా ఉండటం, మరికొన్నిచోట్ల ఎక్కువగా ఉండటం కనిపించింది. దీంతో ఆయా రేషన్ దుకాణాలపై కేసులు నమోదు చేశాం.

ఈనెలలో ఎన్ని క్వింటాళ్ల రేషన్ సీజ్ చేశారు?

జిల్లాలో నెలరోజుల వ్యవధిలో 3,585 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశాం. బియ్యం మిల్లులతోపాటు లారీల్లో తరలిస్తున్న బియ్యాన్ని కూడా స్వాధీనం చేసుకొని పౌరసరఫరాల గోడౌన్లకు తరలించాం. ఆ బియ్యంతో సంబంధం ఉన్న 42 మందిపై కేసులు కూడా నమోదు చేశాం. ప్రభుత్వం పేదలకు అం దిస్తున్న బియ్యాన్ని ఇత ర ప్రాంతాలకు తరలిం చాలని చూస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదు.



తనిఖీల సమయంలో వత్తిళ్లు లేవా?

రేషన్‌షాపుల తనిఖీలు, మిల్లులు, వాహనాల్లో తరలింపు సమయంలో పట్టుకుంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. మాకు ఇంత వరకు ఎలాంటి వత్తిళ్లు రాలేదు. జిల్లావ్యాప్తంగా ఎక్కడైనా అక్రమంగా బియ్యం తరలింపు జరుగుతుంటే జాయింట్ కలెక్టర్‌తోపాటు ఇతర అధికారులకు కూడా సమాచారం వస్తోంది, వెంటనే దాడులు చేసి పట్టుకుంటున్నాం. ప్రభుత్వపరంగా తమకు అన్ని విధాలుగా సహకారం ఉంది. అందువల్ల తమకు ఎటువంటి ఒత్తిడి రావడం లేదు.

మాఫియా పరేషన్!

(5వ పేజీ తరువాయి)

చీకటి పడిన వెంటనే బియ్యాన్ని తరలించుకుపోతున్నారు. అందుకోసం మాఫియా ప్రైవేటు వాహనాలు కొనుగోలు చేసి వాటిని ఏరోజుకారోజు తరలించుకుపోతున్నారు. వాటితోపాటు పేదలకు బియ్యాన్ని సరఫరా చేయాల్సిన ఎండీయూ వాహనాల్లోనే కొందరు బియ్యాన్ని మాఫియాకు తరలిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారం మాఫియా సిండికేట్ కనుసన్నల్లోనే జరగడం విశేషం.

● బినామీ షాపులతో మాయ

జిల్లాలో చాలా షాపులు రేషన్ మాఫియా కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. ఉదాహరణకు గుంటూరు నగరంలో వున్న 204 రేషన్ షాపుల్లో 40కి పైగా రేషన్ షాపులు రేషన్ మాఫియా డాన్ అదుపులోనే వున్నాయి. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రేషన్ డాన్ వాటిల్లో పెట్టుబడులు పెట్టి పేదల బియ్యం అక్రమ మార్కెట్ మొత్తాన్ని తన గుప్పెట్లో పెట్టుకున్నాడు. షాపుల్లో వచ్చే సరుకు వ్యత్యాసాలను మిగిలిన షాపులతో అనుసంధానం చేసి ఎవరికీ తెలియకుండా బియ్యాన్ని తరలించుకుపోతున్నారు. విధిలేని పరిస్థితిలో దొరికిపోతే 'డాన్' రంగప్రవేశం చేసి చక్కదిద్దుతాడు. ఆరోపణలు వచ్చి డీలర్షిప్పుకు ప్రమాదం వస్తే డీలర్షిప్ బదిలీ బాధ్యత కూడా తీసుకుని తన అనుయాయులకే డీలర్షిప్ వచ్చేలా పావులు కదుపుతూ మాఫియాను ఏకచత్రాధిపత్యంతో నడుపుతున్నారు. ఇలా ఎక్కడికక్కడ మాఫియా సిండికేట్ వ్యవహారాలను చక్కబెట్టి యథేచ్ఛగా పేదల బియ్యాన్ని కొల్లగొడుతోంది.

● మాఫియాకు మిల్లర్ల దన్ను

రేషన్ మాఫియా అక్రమాలకు మిల్లర్లు దన్నుగా నిలుస్తున్నారు. జిల్లాలోని పెద్ద పెద్ద మిల్లర్లందరినీ మాఫియా సిండికేట్లో భాగస్వాములను చేసుకుని వారి మిల్లుల్లోనే బియ్యాన్ని ప్రాసెసింగ్ చేస్తున్నారు. ఎండీయూ వాహనదారుల దగ్గర, రేషన్ డీలర్ల దగ్గర రూ. 16 నుంచి 21 రూపాయలకు కొనుగోలు చేసిన బియ్యాన్ని మిల్లులకు తరలించి, ప్రాసెసింగ్ చేసి సన్నబియ్యం పేరుతో మార్కెట్లోకి రూ. 55 నుంచి 60 రూపాయలకు చలామణీ చేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ చేపట్టిన తనిఖీల్లో 200 టన్నుల రేషన్ బియ్యం రైస్ మిల్లర్ల దగ్గర దొరికింది. రవాణాకు సిద్ధంగా వున్న లారీలను కూడా ఆయన సీజ్ చేశారు. జిల్లాలో రేషన్ మాఫియా ఎంత బలంగా వుందనేది మంత్రి స్వయంగా చేపట్టిన తనిఖీల్లో వెల్లడయింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం పేదల బియ్యం అక్రమాలపై దృష్టి సారించింది.

మిర్చి యార్డులో కలవరం

(5వ పేజీ తరువాయి)

మిర్చియార్డులో పర్సన్ ఇంచార్జిలుగా కొనసాగారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇటువంటి పద్ధతిలో కొనసాగిన అధికారుల నేతృత్వంలో అక్రమాలు జరిగినట్లు విజిలెన్స్ నిర్ధారించింది. వారి పేర్లను కూడా ప్రభుత్వానికి అందజేసిన నివేదికలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ఇక్కడ పనిచేసిన ఇద్దరు సెక్రటరీలు భారీ అవినీతికి పాల్పడినట్లు నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. వారి కనుసన్నల్లోనే అన్ని వ్యవహారాలు జరిగినట్లు నిర్ధారించారు. రాజకీయ నేతల అడుగులకు మడుగులొత్తి యార్డు ఆదాయానికి పూర్తిస్థాయిలో గండికొట్టారు. ఈ-నామ్ పోర్టల్ నిర్వహణలోనూ, కటింగ్ వ్యాపారం ప్రోత్సహించటంలోనూ వీరిది కీలక పాత్ర అని తేల్చారు. లైసెన్స్‌ల రెన్యూవల్ వ్యవహారంలో ఒక సెక్రటరీ ఏకపక్షంగా వ్యవహరిచినట్లు తేలింది. మొత్తం 286 లైసెన్స్‌లు ఉండగా, కేవలం 56కు మాత్రమే త్రిసభ్య కమిటీ అనుమతి పొందారు. మిగిలిన వాటికి సెక్రటరీనే రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు మామూళ్లు తీసుకొని రెన్యువల్ చేసినట్లు తెలుస్తోంది. గడచిన ఐదేళ్ల కాలంలో ఇదే సెక్రటరీలను మార్చి మార్చి యార్డు విధుల్లో నియమించారు.

లక్షల క్వింటాళ్ల మిర్చి ఈ-నామ్‌లో పెండింగ్

యార్డులో అవినీతి, అక్రమాలు జరిగేందుకు అన్ని స్థాయిలో సిబ్బంది సహకరించారు. యార్డుకు వచ్చిన మిర్చిని ఈ-నామ్‌లో అప్‌లోడ్ చేయటం, దాన్ని క్లియర్ చేయటంలో మితిమీరిన నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు తెలుస్తోంది. కొద్ది రోజుల క్రితం వరకు కూడా సుమారు 13 లక్షల క్వింటాళ్ల మిర్చికి సంబంధించి ఈ-నామ్‌లో పెండింగ్ స్టేటస్ చూపించినట్లు విచారణలో తేలింది. ఉద్దేశ పూర్వకంగానే ఇటువంటి పనులు చేసి జీరో, కట్ బిజినెస్‌కు ఇంచార్జీలు, సూపర్‌వైజర్లు సహకరించినట్లు తెలుస్తోంది. ఎగుమతి, దిగుమతి వ్యాపారులతో చేతులు కలిపిన సిబ్బంది రైతుల ప్రయోజనాల కు కూడా దెబ్బ కొట్టినట్లు నిర్ధారణ అయ్యింది.

అసైన్డ్ రైతులకు కౌలు

(5వ పేజీ తరువాయి)

వీరికి చట్టబద్ధమైన కౌలు, ప్రయోజనాలు కల్పించింది. అయితే గత ప్రభుత్వం 1, 2, 3 కేటగిరీల భూములపై సీఐడీ కేసులు నమోదు చేయడం వల్ల ఆ రైతులకు సంవత్సరాది కౌలు, నివాస స్థలాలు, వాణిజ్య ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలిపివేసింది. వాటిపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపి నివేదికను సీఐడీ అధికారులకు పునఃపరిశీలన నిమిత్తం పంపగా తొలి విడతలో 1,234 మంది రైతులకు అర్హత లభించిందని, వారికి చట్టబద్ధమైన ప్రయోజనాలు ఇస్తున్నట్లు ఈ ఆగస్టులో సీఆర్డీఏ, ప్రభుత్వం ప్రకటించింది. 1,234 మందికి వార్షిక కౌలు రూ. 22. 03 కోట్ల రూపాయలు జమ చేసింది.

● రెండో విడతలో..

రెండో విడతగా మరో 609 మంది రైతులకు అర్హత లభించిందని సీఆర్డీడే కమిషనర్ తెలిపారు. వారికి 2.35 కోట్ల రూపాయలకు ప్రతిపాదనలు ఆమోదించగా, బిల్లు ఆర్థిక శాఖ వద్ద ఫండ్ క్లియరెన్సులో ఉన్నట్లు ఆయన వివరించారు. వారికి కేటాయించిన రిటర్నబుల్ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసేందుకు తగిన చర్యలు అధికారులు చేపట్టారని తెలిపారు. నాట్ ట్యాలీడ్ జాబితాలో వున్న 5, 6 కేటగిరీల రైతుల పొలాలపై కూడా విచారణ జరపగా 484 మంది రైతులకు అర్హత లభించిందని ఈనెల 27న వారి కౌలు చెల్లింపులకు ఆమోదం లభించిందని, వారికి కౌలు చెల్లించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశామని ఆయన తెలియజేశారు. వారి ప్లాట్ల రిజిస్ట్రేషన్లకూ ఆటంకం ఉండదని, త్వరతగతిన రిజిస్ట్రేషన్లు పూర్తి చేసేందుకు ఆదేశాలు జారీ చేశామని సీఆర్డీఏ కమిషనర్ తెలియజేశారు. కాగా 1,2,3 కేటగిరీలకు చెందిన అర్హత కలిగిన 683 మంది రైతుల వివరాలను జిల్లా కలెక్టర్ ఈనెల 26న సీఆర్డీఏ కార్యాలయానికి పంపగా దానిని సీఐడీ అధికారుల పునః పరిశీలనకు పంపించారు. వారి ఆమోదం లభిస్తే వారికి కూడా వార్షిక కౌలుతోపాటు, చట్టపరంగా రావాల్సిన ప్రయోజనాలు అందనున్నాయి.

7న పేరెంట్స్, టీచర్స్ మీటింగ్

» పండుగ వాతావరణంలో నిర్వహించాలి

» కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 7వతేదీన జరిగే మెగా పేరెంట్స్-ఉపాధ్యాయుల మీటింగ్ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి సోమవారం సాయంత్రం మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచి మెరుగైన ఫలితాలను రాబట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అన్ని పాఠశాలల్లో నిర్వహించే కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు వేర్వేరుగా పాల్గొనేలా ప్రణాళికలు రూపొందించాలని మండల విద్యాధికారులను ఆదేశించారు. ఆయా పాఠశాలల్లో చదివి ఉన్నత స్థానాల్లో ఉన్న పూర్వ విద్యార్థులను కూడా ఈ కార్యక్రమాలకు ఆహ్వానించాలని సూచించారు. రాష్ట్రీయ బాలసురక్ష కింద విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు కూడా నిర్వహించాలన్నారు. మెనూ ప్రకారం పెట్టే భోజనానికి అదనంగా మరో మూడు రుచికరమైన ప్రత్యేక వంటలను ఆ రోజు విద్యార్థులకు పెట్టాలని ఆదేశించారు. విద్యార్థులకు అపార్ ఐడీ జనరేట్ చేసే క్రమంలో ఎదురయ్యే ఆధార్ కార్డు సవరణ సమస్యలను త్వరగా పరిష్కారం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను ఆదేశించారు. జిల్లాలోని ప్రతి ఇంటిని ఫొటో తీసి జియో ట్యాగింగ్ చేయాలని, అందరి బ్యాంకు ఖాతాలను ఎన్‌పీసీఐతో మ్యాపింగ్ చేయాలన్నారు హౌస్‌హోల్డ్ క్లస్టర్లను ఆయా హ్యాబిటేషన్లు, గ్రామ పంచాయతీలు, రెవెన్యూ గ్రామాలతో మ్యాపింగ్ చేయాలన్నారు. ఎనర్జీ అసిస్టెంట్లతో సహా సచివాలయ ఉద్యోగులందరూ బయోమెట్రిక్ హాజరు ఖచ్చితంగా వేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సూర్య ఘర్ పథకం కింద సోలార్ పవర్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకునేలా ప్రజలను ప్రోత్సహించాలన్నారు. అనంతరం అంశాల వారీగా సమీక్షించి కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోపాలకృష్ణ, వివిధ శాఖల అధికారులు వెంకటనాయుడు, కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, శ్రీనివాస ప్రసాద్, రాజశేఖర్, రమేష్, జోసఫ్‌కుమార్ పాల్గొన్నారు.

నారాయణస్వామి దేవస్థాన ఆదాయం రూ.1,04,670

సీఎస్‌పురం(పామూరు) డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానానికి వివిధ రూపాల్లో ఆదివారం రూ.1,04,670 వచ్చినట్లు ఈవో శ్రీగిరిరాజు నరసింహాబాబు తెలిపారు. టికెట్ల అమ్మకం ద్వారా రూ.50,710, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.22,480, శాశ్వత అన్నదానంకు రూ.22,480, విరాళాల ద్వారా రూ.9వేల ఆదాయం సమకూరినట్లు తెలిపారు.


వివిధ దశల్లో ఉన్న మొక్కజొన్న పైరు

పైర్లకు జీవం

» పంట కాలువల్లో గడ్డి దుబ్బులు తొలగించాలంటున్న రైతులు


పంట కాలువలో పారు దలకు అడ్డుగా ఉన్న గడ్డి దుబ్బులు

చీరాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజుల నుంచి కురుస్తున్న చి రు జల్లులతో సాగులో ఉన్న పైర్లన్నీ జీవం పోసుకుంటున్నాయి. దీంతో సాగుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో నష్టం నామమాత్రమేని, అన్ని పైర్లకు ఇది ఎంతో ఉపయోగంగా ఉంటుందని రైతులు చెప్తున్నారు. వరి, మొక్కజొన్న, మినుము పైర్లకు తడులు ఇచ్చే అవసరం లేకుండా ప్రస్తుత వర్షాలు ఉపకరిస్తున్నాయని చెప్తున్నారు. ఎత్తిపోతల పథకాల కింద ఉన్న పంట కాలువల్లో పలుచోట్ల గడ్డి దుబ్బులు నీటి పారుదలకు ఆటంకంగా మారాయని, వాటిని తొలగించాలని రైతులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో పోలి పాడ్యమి

చినగంజాం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మార్గశర మాసం తొలిరోజున జరిగే పోలిస్వర్గంను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని బాలకోటేశ్వరస్వామి ఆలయం, స్థానిక గంగా పార్వతీ సమేత చిదంబరేశ్వరస్వామి, ఆలయాల వద్ద మహిళలు పూజలు చేశారు. దీనినే పోలాల అమావాస్య అని కూడా పిలుస్తారు. పోలిస్వర్గ రోజున అరటిదువ్వలో ఆవు నెయ్యితో దీపారాధన చేసి దానిని నీటిలో వదిలితే శ్రీ మహావిష్ణువు ప్రీతి చెంది వైకుంఠలోక ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. పోలిస్వర్గ కథను అర్చకస్వాములు భక్తులకు విశదీకరించారు. అన్ని శివాలయాల్లో భక్తులు చేశారు.

మార్టూరు : మార్గశిర పోలి పాడ్యమి సందర్భంగా పోలిస్వర్గం పూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివాలయాల్లో దీపాలను వెలిగించారు. అనంతరం అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఘట్టేశ్వరస్వామి ఆలయం, జాతీయరహదారిప్రక్కన ఉన్న శ్రీదుర్గామల్లీశ్వరిస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.


ఘట్టేశ్వరస్వామి


బాలకోటేశ్వరస్వామి ఆలయ కోనేరు వద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు

నిరాశపరిచిన వాన

» ఎదురుచూస్తున్న మొక్కజొన్న, పొగాకు రైతులు

» జల్లులతో రోడ్లు బురదమయం

బల్లికురవ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నాలుగు రోజుల నుంచి తుఫాన్ ప్రభావంతో వర్షాలు పడితే ఉపయెగం అని ఎదూరు చూసిన రైతులకు చిరు జల్లులు నిరాశను మిగిల్చాయి. వాతావరణం చల్లబడి కేవలం గాలులు వీయడంతో చిరుజల్లులతో రోడ్లు బురదమయం అయ్యాయి. మొక్కజొన్న, పొగాకు సాగు చేసిన రైతులు వాన కోసం ఎదురు చూస్తున్నారు. వాన కురవకపోవడంతో రైతులు మొక్కజొన్నకు ఇంజన్‌ల ద్వారా నీటిని పెడుతున్నారు. కొందరు సాగర్ నీటిని వినియోగించే పనిలో ఉన్నారు. జల్లులతో బురదగా మారిన రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఇంకొల్లు : ప్రస్తుతం కురిసిన జల్లులు పొగాకు, మిర్చి, శనగకు ఉపకరస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆది, సోమవారం చిన్నపాటి వాన కురిసింది.


బురద రోడ్లుతో ప్రజల అవస్థలు


పత్తిని పరిశీలిస్తున్న సీసీఐ అధికారులు

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

పర్చూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు పత్తి కొనుగోలు కేంద్రాన్ని పర్చూరులోని వెంకటేశ్వర కాటన్ మిల్‌లో సోమవారం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ వారు ప్రారంభించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర మేరకు రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేస్తామని సీసీఐ అధికారులు తెలిపారు. పత్తిని సీసీఐ ద్వారా మాత్రమే అమ్ముకోవాలని, ఈక్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలని అధికారులు రైతులకు సూచించారు. క్వింటా రూ.7,521 మద్దతు ధరతో కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. తేమ శాతాన్ని బట్టి ధర నిర్ణయిస్తారని సీసీఐ బయ్యర్ అరుణ తెలిపారు. దళారుల చేతిలో రైతులు మోసపోకుండా ఉండేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ కార్యదర్శి ఓటీఎస్‌యూ ప్రసాద్, అసిస్టెంట్ బయ్యర్ అరవింద్, ఏఎంసీ సిబ్బంది సుస్మిత, ప్రసాద్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి సరుకులు అందజేత

అద్దంకిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శింగరకొండలోని వృద్ధుల ఆశ్రమానికి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. సోమవారం టెలికం రిటైర్డ్ ఏఈ పసుపులేటి ఆంజనేయులు మనుమరాలు యశ్విత పుట్టినరోజు సందర్భంగా ఆశ్రమానికి నిత్యావసరాలను అందజేశారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, మురళి సుధాకరావు, శ్రీనివాసరావు, హరిప్రసాద్, లేవి ప్రసాద్, ఆశ్రమ నిర్వాహకులు రావూరి రంగయ్య పాల్గొన్నారు.

దీక్షధారులకు అన్నదానం


భిక్షను స్వీకరిస్తున్న దీక్షధారులు

ఇంకొల్లు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు హరిహర ధార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప దీక్షధారులకు 30వ రోజు సోమవారం అన్నదానం నిర్వహించారు. పోలేరమ్మ గుడిలో ఇంకొల్లు అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో దాతలసహకారంతో దీక్షధారులకు అన్నదానం నిర్వహిస్తున్నారు.

నిద్రిస్తున్న వ్యక్తిపై దూసుకుపోయిన కారు

» అక్కడికక్కడే మృతి

» రోడ్డు పక్కనే చీకట్లో ఉండడం, చూడకుండా వాహనం నడపడమే ప్రమాదానికి కారణం

ఈపూరుపాలెం (చీరాలటౌన్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం ఈపూరుపాలెం శివాలయం వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. పంచాయతీ పరిధిలోని సీతారామపేటకు చెందిన ఎలిబోలు సత్యనారాయణ(56) తన భార్యతో 15 ఏళ్ల కిందట విడిపోయి దూరంగా ఉంటున్నారు. ఈక్రమంలో స్థానికంగా ఉన్న శివాలయం ముందు రోడ్డు పక్కన నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి, పైగా చీకటి కావడంతో గమనించని తోటవారిపాలెంకు చెందిన కారు డ్రైవర్ జంజనం శ్రీనివాసరావు నిదిరిస్తున్న వ్యక్తిపైకి కారు ఎక్కించాడు. దీం తో సత్యనారాయణ అక్కడికక్కడే మృతిచెందారు. డ్రైవర్ ఈపూరుపాలెం పోలీసుల వద్దకు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని సోమవారం పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

డ్రెయిన్‌లో పడి వ్యక్తి మృతి


ఆనందరావు మృతదేహం

అద్దంకి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సైడ్ డ్రెయిన్‌లో పడి బత్తుల ఆనందరావు(40) మృతి చెందాజుజీ. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పంగులూరు మండలం రామకూరుకు చెందిన బత్తుల ఆనందరావు సోమవారం అద్దంకి వచ్చారు. అద్దంకిలో ఉన్న స్నేహితుడితో కొంతసేపు గడిపారు. అనంతరం రామకూరు వెళ్లేందుకు పట్టణంలోని కొత్తదామావారిపాలెం వద్ద కలవకూరు రోడ్డులో వేచి ఉన్నాడు. అటు వైపు వెళ్లే ఆటోను ఆపినప్పటికీ ఎక్కించుకోలేదు. దీంతో సమీపంలో ఉన్న సైడ్ కాలువ వద్ద కూర్చున్నాడు. ఆ సమయంలోనే సైడ్ డ్రైన్‌లో పడి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. అనంతరం స్థానికులు గుర్తించి 108కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న బంధువులు వచ్చి ఆనందరావు మృతదేహాన్ని తీసుకువెళ్లారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

దర్శి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏడీఏ బాలాజీనాయక్ సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో ఎనిమిది మండలాలకు చెందిన వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులకు జలవనరుల కేంద్రం ఆధ్వర్యంలో సోమవా రం అవగాహన సదస్సు నిర్వహించారు.


వివరాలు తెలుసుకుంటున్న డీఈఈ శ్రీనివాసరావు

మణికేశ్వరం ఆలయాభివృద్ధి పనుల పరిశీలన

అద్దంకి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మణికేశ్వరంలో మల్లేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను దేవదాయశాఖ డీఈఈ సీహెచ్ శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో గుంటుపల్లి వాసుబాబు, ఐ-టీడీపీ నియోజకవర్గ అధ్యక్షడు షేక్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు సహకరించాలి

అద్దంకి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని వ్యాపార, సర్వీసు వర్గాల ప్రజలు సచివాలయ సిబ్బంది చేపట్టే సర్వే కు అవసరమైన డాక్యుమెంట్లను అందజేసి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్ ప్రీన్యూర్స్ (ఎంఎస్ఎంఈ) వ్యాపారం నిర్వహించే సంస్థల సర్వే నిర్వహిస్తున్నందున సహకరించాలని కోరారు. వ్యాపార, సర్వీస్ సంస్థ అభివృద్ధి నిమిత్తం ప్రభుత్వం సర్వే చేపట్టిందన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్స్ కోర్స్‌కు ఉచిత శిక్షణ

అద్దంకిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అద్దంకి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు మూడు నెలల పాటు ఉచితశిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.ప్రణయ్, కళాశాల ప్రిన్సిపాల్ సాహిల్‌బాబు సోమవారం ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివిన 18 నుంచి 35 సంవత్సరాల లోపు ఉన్న నిరుద్యోగ యువతీయువకులు ఈ నెల 4వ తేదీలోపు దరకాస్తులు చేసుకుని అవకాశాన్ని సద్వినియోపర్చుకోవాలి కోరారు. శిక్షణ పూర్తి చేసిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సర్టిఫికెట్ ఇస్తాయని తెలిపారు. వివరాలకు 9543970871, 9440635677 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

పూనూరులో శిథిలావస్థలో పశు వైద్యశాల

» భయంతో సిబ్బంది విధులు

» నూతన భవన నిర్మాణానికి కృషి చేయాలని పోషకుల విజ్ఞప్తి



పూనూరులో శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల భవనం


బయటపడిన ఇనుప చువ్వలు

యద్దనపూడి, (మార్టూరు) డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలంలో పూనూరు పెద్ద గ్రామం. ఈ గ్రామంలోని పశువైద్యశాల ప్రస్తు తం శిథిల దశకు చేరుకుంది. పెద్ద సంఖ్యలో పశుపోషకులు ఈ ఆసుపత్రికి పశువులను తీసుకొస్తుంటారు. అంతేగాకుండా గన్నవరం, మున్నంగివారిపాలెం, చింతగుంటపాలెం గ్రామాలకు చెందిన పోషకులు కూడా వైద్యం కోసం ఈ ఆస్పత్రికే పశువులను తెస్తారు. అయితే పశు వైద్యశాల భవనం శిథిల దశకు చేరింది. భవనంలోపల పైకప్పుకు సంబందించి సిమెంట్ స్లాబులు రాలిపోవడంతో లోపలున్న ఇనుపచువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. దాంతో వైద్య సేవలను అందించే వైద్యులు, సిబ్బంది విధి నిర్వహణలో ఏ క్షణంలోనైనా భవనం పడిపోతుందోనని భయం భయంగా విధులను నిర్వర్తిస్తున్నారు. ఈ భవనాన్ని గ్రామస్థులు బత్తుల చినకోటయ్య కుమారుడు రామయ్య జ్ఞాపకార్థం గన్నమనేని కోటయ్య 1971లో సొంతనిధులతో ని ర్మాణం చేయించారు. అప్పటి నుంచి ఈ భవనంలో పశువైద్యశాలను నిర్వహిస్తున్నారు. దాదాపుగా 53 ఏళ్ల కిందట నిర్మించిన భవనం కావడంతో శిథాలవస్థకు చేరింది. గ్రామంలోని టీడీపీ నాయకులు కొత్తభవన నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకు కృషి చేయాలని పశు పోషకులు కోరుతున్నారు.

రోటరీ సహకారంతో రక్తదానం

అద్దంకిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రక్తదానంతో బాధపడుతున్న మహిళకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం చేసారు. సోమవారం రక్త హీనతతో బాధపడుతున్న కొత్తమాసు లక్ష్మీ కోటేశ్వరమ్మ అత్యవసరంగా బీ పాజిటివ్ రక్తం కావాలని వైద్యులు చెప్పగా రోటరీ బ్లడ్ బ్యాంక్ డైరక్టర్ చుం డూరి మురళీసుధాకరరావు ప్రోత్సాహంతో అద్దంకికి చెందిన మారం సత్య సురేంద్రకుమార్ ద్వారా రక్తాన్ని సేకరించారు. క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కోశాధికారి మల్యాద్రి శ్రీనివాసరావు, ఏపీజీ రమేష్ పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డే వెలవెల

» పలు శాఖల అధికారులు గైర్హాజరు

» డుమ్మాకొట్టినవారిపై చర్యలు : తహసీల్దార్

బల్లికురవ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యలయంలో నిర్వహించే గ్రీవెన్స్ డే కార్యక్రమానికి అధికారులు డుమ్మా కొట్టడంతో వెలవెలబోయింది. తహసీల్దార్ కవిత ఒక్కరే విధులకు పాల్గొన్నారు. మిగిలిన అధికారులు హాజరు కాలేదు. సుదూర గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు సంబంధిత శాఖల అధికారులు లేకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరిగారు. ఇటీవల అధికారులు హాజరుకావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాలను పాటించడం లేదని, ఎవరూ సమయపాలన పాటించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఇకనైనా ఎంతో విలువైన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో అందరు అధికారులు అందుబాటులో ఉండేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


గ్రీవెన్స్‌కు హాజరైన తహసీల్దార్

హాజరుకానివారిపై కలెక్టర్‌కు నివేదిక ఇస్తాం

గ్రీవెన్స్ డే కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కాకపోయినా, విధులకు డుమ్మా కొట్టినా వారిపై కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామని తహసీల్దార్ కవిత తెలిపారు. వచ్చే వారం నుంచి అందరు అధికారులు హాజరయ్యేలా చర్యలు చేపడతామన్నారు. సమస్యలను ప్రజలు తమ దృష్టికి తెస్తే సంబంధిత అధికారులకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

భూ సమస్యలు సకాలంలో పరిష్కరిస్తాం


అర్జీని స్వీకరిస్తున్న తహసీల్దార్

పంగులూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రీ-సర్వేలో తలెత్తిన భూ సమస్యలతో పాటు గ్రీవెన్స్ ద్వారా తమ దృష్టికి వచ్చిన రైతుల సమస్యలు వేగవంతంగా పరిష్కరిస్తామని తహసీల్దార్ పి.సింగారావు అన్నారు. కార్యాలయంలో సోమవారం సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మార్టూరు మండలం బొల్లాపల్లి గ్రామ రైతు వీరవల్లి కృష్ణమూర్తి తన తండ్రి ద్వారా కొండమంజులూరుల రెవెన్యూ పరిధిలో సంక్రమించిన 95 సెంట్ల వ్యవసాయ భూమిని తండ్రి మరణానంతరం ఆన్‌లైన్‌లో పేరు మార్చాలని ఏళ్లుగా తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికే ఆ భూమిని రీసర్వే చేశారని, వెంటనే ఆన్‌లైన్ చేస్తామని తహసీల్దార్ తెలిపారు. గ్రీవెన్స్‌లో ఆన్‌లైన్ దరఖాస్తులతో పాటు పాస్ పుస్తకాలు, పేరు సవరణ, ఫ్యామిలీ మెంబరు పత్రాలు కోరుతూ 11 అర్జీలు అందినట్లు తహసీల్దార్ తెలిపారు.

కుటుంబంలో విషాదం నింపిన ఈత సరదా

» గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

» శోకసంద్రంలో వీరన్నపాలెం


కుమారుడు మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

పర్చూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కూలినాలి చేసుకొని పిల్లలను ఉన్నత చదువులు చదివించి ప్రయోజకుల్ని చేద్దామనుకున్న నిరుపేద కుటుంబంలో విషాదం మిగిలింది. చేతికి అందివచ్చిన కుమారుడు చెరువులో పడి మృతి చెందడం తల్లిదండ్రులను శోకసంద్రంలో ముంచింది. ఈ ఘటన మండలంలోని వీరన్నపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. ఆదివారం ఈతకు వెళ్లి పాలేటి జస్వంత్ (17) గల్లంతైన విషయం తెలిసిందే. రాత్రంతా వెతికినా ఫలితం దక్కలేదు. సోమవారం ఉదయం తిరిగి గాలించగా జస్వంత్ మృతదేహం లభ్యమైంది. దీంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా విలపించారు. వారిని చూసి గ్రామస్థులు కూడా కంటతడి పెట్టారు. వీరన్నపాలెం గ్రామానికి చెందిన పాలేరు శ్రీనివాసరావు, కోకిల దంపతులకు చెందిన జస్వంత్ ఆదివారం స్నేహితులతో ఈతకు వెళ్లి ప్రమాదానికి గురయ్యాడు.

15గంటలు శ్రమించారు

చెరువులో గల్లంతైన యువకుడు జస్వత్ మృతదేహం కోసం ఆదివారం రాత్రి నుంచి తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎస్ఐ మాల్యాద్రి పర్యవేక్షణలో చీరాల అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. 15 గంటల తరువాత ఎట్టకేలకు సోమవారం ఉదయం 7 గంటలకు మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ ప్రక్రియ సాగినంత వరకూ తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్థులు చెరువుగట్టుపైనే నిరీక్షించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించారు.

నిర్మాణాలు సరే.. భద్రత ఎక్కడ?

» జోరుగా సాగుతున్న వాడరేవు - పిడుగురాళ్ల హైవే పనులు

» డ్రైవింగ్ డైవర్షన్‌లో సిబ్బంది నిర్లక్ష్యం

» మృత్యుమార్గాలుగా ప్రయాణాలు

» గాలిలో ప్రాణాలు


ఆర్టీసీ గ్యారేజీ సమీపంలో పడిఉన్న హెచ్చరిక బోర్డ్


స్ట్రయిట్‌కట్ వద్ద హైవే నిర్మాణ పనులు


చీరాల -పర్చూరు రోడ్డులో మృతి చెందిన అధ్యాపకుడు (ఫైల్)

చీరాలటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలో గత కొంత కాలంగా జరుగుతున్న వాడరేవు - పిడుగురాళ్ల జాతీయ రహదారి నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. గతంలో జిల్లా అధికారులు సైతం నిర్మాణాలను పరిశీలించి డిసెంబర్ 25 నాటికి జాతీయ రహదారి వినియోగంలోకి రావాలని పలు హెచ్చరికలు కూడా జారీ చేశారు. దీంతో పనులు మాత్రం ఏమాత్రం తగ్గడం లేదు. పనులు వేగవంతంగానే జరుగుతున్నాయి. కానీ పనుల్లో నిమగ్నమైన సిబ్బంది వాహన దారులకు ఏర్పాటు చేసే డైవర్షన్ బోర్డుల ఏర్పాటులో నిర్లక్ష్యంగా ఉంటున్నట్లు వాదనలు వినిపిస్తున్నాయి. ఈక్రమంలో ప్రస్తుతం ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్ వద్ద లోకల్ సర్వీసు రోడ్డుపై మార్కింగ్ చేసి పిల్లర్‌లు పోస్తున్నారు. చీరాల - బాపట్ల రోడ్డులోని ఆర్టీసీ గ్యారేజీ సమీపంలో డైవర్షన్ తాత్కాలిక బోర్డును ఏర్పాటు చేశారు. అయితే దానిని ఎవరైనా నెట్టివేశారో లేక వాహనంతో ఢీకొట్టారో తెలియదు గానీ అది కుప్పకూలి ప్రమాదకరంగా ఉంది. వాహనదారులు మాత్రం ఏమాత్రం లెక్క చేయకుండా అటువైపే వెళ్తున్నారు. మరోవైపు వాహనదారులు కూడా నిర్మాణాలకు సంబంధించిన మెటీరియల్, వివిధ పరికరాలను ఏమీ పట్టించుకోకుండా ప్రయాణాలు సాగిస్తూ ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారు. ఈ మార్గంలో ఈ రెండు నెలల కాలంలో చీరాల - పర్చూరు రోడ్డులో అధ్యాపకుడు ద్విచక్ర వాహనం అదుపుతప్పి లోయలో పడి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనతో ఆ కుటుంబం తీరని విషాదంలో ఉంది. చీరాల సమీపంలోని విజయనగర్ కాలనీ వద్ద మెటీరియల్ కారణంగా ఆటో అదుపుతప్పి నలుగురు మహిళా కూలీలు గాయపడ్డారు. వాడరేవు సమీపంలోని కీర్తివారి పాలెం వద్ద కల్వర్ట్‌లో పిట్టు శ్రీను మృతి చెందారు. అయితే ఈ ఘటనకు కారణాలు తెలియాల్సి ఉంది. పర్చూరు - చిలకలూరిపేట రోడ్డులో హైవే నిర్మాణాల వద్ద డైవర్షన్ సక్రమంగా లేకపోవడంతో అదుపుతప్పిన బస్ టిప్పర్‌ను ఢీకొట్టింది. ఐదుగురు సజీవదహనం అయ్యాయి. ప్రమాదాల నియంత్రణకు కొంత డ్రైవింగ్ నిర్లక్ష్యం మరి కొంత హెచ్చరికల్లో లోపం ఉన్నట్లు ప్రజలు భావిస్తున్నారు. కోరలు చాపిన హైవేలో ప్రమాదాల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.